# బ్రహ్మ పురాణము

## సూర్యుని వృత్తాంతము :

శౌనకాది మహామునులు నైమిశారణ్యమున పండ్రెండ్రు సంవత్సరముల దీక్షతో ఒక మహాయాగము చేయుచుండిరి. అచటికి రోమహర్షణుడు (సూతుని తండ్రి) వచ్చెను. మునులందరును అతనికి సకల మర్యాదలు చేసి "నీవు సర్వపురాణములను చక్కగా ఎరిగినవాడవు. నీకంటె తెలిసిన వారెవరున్నారు?కావున నీవు సృష్టిప్రకారము మొదలు దేవరాక్షస మానవచరిత్రములు, భగవద్విషయములును తెలియజెప్పుము"అని యడుగగాసూతుడు(ఇతడునుసూతుడే) ఇట్లు బ్రహ్మాండపురాణము చెప్పనారంభించెను.

బ్రహ్మ మానస పుత్రుడైన కశ్యప్రజాపతికి దక్షుని కూతురైన అదితియందు వివస్వంతుడను కుమారుడు కలిగెను. అతడే సూర్యుడు. అతనికి త్వష్ట తన కుమార్తెయైన సంజ్ఞనిచ్చి పెండ్లిచేసెను. ఆమె సూర్యునిఉగ్రతేజమునుసహింపలేకుండెను. ఆమెయొకనాడుసూర్యునితో,"స్వామీ!నీతేజముభరింపరానిదిగానున్నది. అండములు (గర్భ పిండములుగూడ) గూడ మృత్తినొందునట్లు చేయుచున్నది"అనగా ఆమె భావమును గమనింపలేక సూర్యుడు "అలాగుననా?అట్లైనచో, మృతినొందునట్లు చేయు అండములు (బ్రహ్మాండములు) గలవాడను గనుక నాపేరింక మార్తండుడుగునని నవ్వుచు పలికెను. ఆమె ఇంకేమియు మాటలాడలేక పోయినది. సూర్యునకు ఆమెయందుమొదట వైవస్వతుడును (మనువు), తరువాత శ్రాద్ధదేవుడును, ఆ పిమ్మట యముడు - యమున అను కవలపిల్లలును పుట్టిరి. ఇంతమంది పిల్లలు పుట్టినను సూర్యునకు ఆమెయందు మోహము తగ్గలేదు. ఆ విషయమును గమనించి సంజ్ఞాదేవి తనయుండి ఛాయయను దానిని సృజించి, "నేను నా పుట్టినింటికి బోవుచున్నాను. నీవు నా రూపమే కనుక నా స్థానములోనుండి భర్తను సంతోషపెట్టుము. నీవు నా ఛాయవని తెలియనియ్యకుము"అనగా ఆమె, "తప్పనిసరి పరిస్థితులలో గాని చెప్పను"అని మాటయిచ్చెను.సంజ్ఞతండ్రియింటికి పోగా తండ్రి ఆమెను మందలించి, "యెట్టివాడైనను భర్తను విడిచి సాధ్వియైన యిల్లాలు ఉండకూడదని"బుద్ధిచెప్పి తిరిగి పంపివేసెను. ఆమె భర్తయింటికి పోకుండ, ఒక ఆడగుఱ్ఱమై కురుభూములందలి పచ్చికబయళ్ళలో మేయుచు కాలము గడుపుచుండెను.

ఛాయను సూర్యుడు సంజ్ఞయే యనుకొనుచు ఆమెతో కాపురము చేయుచు, ఆమెయందు సావర్ణుడు, శనైశ్చరుడు అను ఇద్దరు కుమారులను పొందెను. ఛాయకు క్రమముగా సవతి బిడ్డలపై ప్రేమ తగ్గిపోసాగెను. వారిని నిర్లక్ష్యముగా జూచుచుండెను. పిల్లలకును ఆమెయందు ప్రేమాభిమానములు తరుగుచుండెను. ఒకనాడు ఛాయ, తమ యెడల ప్రవర్తించిన తీరునకు కోపమువచ్చి యముడు ఆమెను తన్నుటకు కాలెత్తెను. ఛాయకూడ కోపించి "నీ కాలు విరిగిపోవునుగాక"అని శపించెను. యముడు తండ్రియైన సూర్యుని కడకుబోయి, సవతితల్లి తమమీద చూపుతున్న నిరాదరణమును గూర్చియు, సావర్ణి, శనులమీద చూపెడు ప్రేమయు, తల్లి పక్షపాతబుద్ధియు చెప్పి, నాకు గలిగిన శాపమును నివారింపుమని కోరెను. సూర్యుడు అతని నోదార్చి, "నాయనా!యమా!నీవు సత్యవంతుడవు, ధర్మమార్గవర్తనుడవు. అటువంటి నీకే కోపమువచ్చునట్లు చేసినదనగా ఆమె యెంత అనుచితముగా ప్రవర్తించినదో గ్రహించగలను. తల్లి శాపము త్రిప్పుట నా వశము కాదు. కాని నీ ధర్మప్రవర్తనయే నిన్ను శాపవిముక్తునిజేయును"అని పలికెను.

ఛాయను జూచి సూర్యుడు, "నీవు నీ పిల్లలమీద ఇట్లు భేదబుద్ధిచూపుటకు కారణమే"మనిగద్దించియడిగెను.ఆమె సమాధానము చెప్పకుండుటచూచి దివ్యదృష్టితో అంతయు తెలిసికొని శపించబోయెను. ఛాయ అప్పుడు నోరు విప్పినది. సంజ్ఞకు తాను ఛాయను (నీడను) అని చెప్పి తప్పు మన్నింపుమని వేడినది.

సూర్యుడామెను విడిచి మహాక్రోధావేశముతో మామగారింటికి బోయెను. త్వష్ట అతనిని శాంతపరచి, తాను కుమార్తెకు బుద్ధులు చెప్పి అప్పుడే పంపివేసితినని చెప్పెను. ఇంకను కోపముతో మండుచున్న సూర్యుని జూచి మామ యిట్లనెను. "అల్లుడా!ఒకమాట చెప్పెదను వినుము. నీ తేజస్సు మావంటివారికే దుర్భరముగానున్నదికదా!ఒక స్త్రీ, అందునను సుకుమారి యెట్లు భరించగలదు? అందుచేత నిన్ను సానపట్టి కొంత తేజమును తగ్గించెదను. అంగీకరింపుము"మనగా సూర్యుడు ఆమోదించెను. త్వష్ట సూర్యుని తిరిగెడు సానరాతి మీద అరుగదీసెను. అట్లు అరుగదీసినందువలన తాపము (వేడి) తగ్గినదేమోకాని ఆ మెరుపుతో సూర్యుడింకను ప్రకాశవంతుడయ్యెను. త్వష్ట, సూర్యుని అరుగదీసినపుడు రాలిన తేజః కణములతో (రజనుతో) విష్ణుదేవునకు చక్రముచేసి యిచ్చెను.

సూర్యుడు సంజ్ఞను వెదకుచు వెళ్ళి ఒక అరణ్యములో పచ్చికమేయుచున్న ఆడ గుఱ్ఱము రూపములోనున్న ఆమెను గుర్తుపట్టి తానుగూడ ఒక మగగుఱ్ఱమై ఆమెతో రతిక్రీడకు సిద్ధపడెను. ఆమె, తనను బలాత్కరించినది మగగుఱ్ఱమని భావించి, సూర్యుని తేజస్సును తన ముక్కులనుండి బయటకు విసర్జించెను. అది రెండుచోట్ల పడగా దానినుండి ఇద్దరు అశ్వనీదేవతలు పుట్టిరి. వారే, నాసత్యులని పిలువబడిరి. సూర్యుడు సంజ్ఞకు నిజరూపము చూపి సంతోషపరచెను.

సూర్యుని సంతానమైన వైవస్వతుడు మనువయ్యెను. శ్రాద్ధదేవుడు పితృలోకాధిపతియయ్యెను. యముడు దక్షిణదిక్పాలకుడయ్యెను. సూర్యసావర్ణుడు కూడ మనువగును. (ప్రస్తుతము వైవస్వత మన్వంతరము (మనువు పాలనము.) జరుగుచున్నది. రాబోవునది సూర్యసావర్ణ(ర్ణి) మన్వంతరము.) శనైశ్చరుడు గ్రహములలో నొక్కడయ్యెను. యమున భూలోకముల నదిగా ప్రవహించుచున్నది.

ఎవ్వరైనను ఈ సూర్య చరిత్రమును విన్నను, పఠించినను ఆపదలనుండి విముక్తులై ఆయురారోగ్యసంపదలనుబొందునుఅనిసూతుడు మరల నిట్లు చెప్పసాగెను.

**కోణార్క సూర్యుడు, సూర్యారాధన విధానము**

ఉత్కళదేశములో సముద్రతీరమున సూర్యుడు "కోణార్కుడను"పేరుతో వెలసియున్నాడు. అతనిని బ్రాహ్మణాది సకల వర్ణముల వారును భుక్తిముక్తులను గోరి ఆరాధింతురు. మాసములో నుత్తమమైనది మాఘమాసము. అందున శుక్లపక్షమున వచ్చుసప్తమిరథసప్తమి.సూర్యునకుచాలప్రియమైనదినము.ఆనాడు, సముద్రస్నానముచేసి, అనుష్ఠానములు తీర్చుకొని, భాస్కరునికి అర్ఘ్యమిచ్చి బ్రహ్మయజ్ఞమును, పితృతర్పణమును జేసి, శుభ్రమైన వస్త్రములు ధరించి, ఆ సముద్రతీరమునందే, తూర్పుముఖముగా కూర్చుండి, అష్టదళముల పద్మమును ఎర్రచందనము గలిపిన నీటితో వ్రాయవలెను.ఒక రాగిపాత్రయందు (పళ్ళెరమునందు) తిలలు, బియ్యము, ఎర్రచందనము గలిపిన నీటిని పోసి ఎఱ్ఱని పూలు ఉంచి, వానిపై దర్భలు గూడ ఉంచి, దానిమీద ఒక జిల్లేడు ఆకునుంచి (దీనిని అర్కపత్రమని కూడ అందురు. ఇది సూర్యునకు ప్రియమైనది.) దానిలోగూడ తిలతండులాదివస్తువులుంచి, ఆపైనెంకొకరాగిచెంబువంటిదినీళ్ళతో నిలుపవలెను. (ఆచ్ఛాదింపవలెనయున్నది?)

ఆ తరువాత కరన్యాసమును అంగన్యాసమును యథావిధిగాజేసి, ఆగ్నేయనైరృతి, వాయు, ఈశానకోణములందు భాస్కరునే ఆత్మగా (ప్రధానదైవముగా) భావించి ఆకాశమునుండి భాస్కరుని ఆవాహనచేసి కర్ణికాభాగమున స్థాపించి ముద్రాప్రదర్శన చేసి, పరమాత్ముని ధ్యానింపవలెను. ఆపైన ఆరాధకుడు మోకాళ్ళమీద కూర్చుండి ఆ పాత్రను శిరస్సుపై బెట్టుకొని మరల (తెల్లని) పద్మముపై నుంచవలెను. ఆపైన మూడక్షరములమంత్రముతో ("సూరియ"అని) అర్ఘ్యమియ్యవలెను. దీక్షితుడు కానివాడు గూడ ఈవిధముగా సూర్యుని ఆరాధింపవచ్చును. భాస్కరుడు భక్తిభావమునే ప్రధానముగా చూచును.

యంత్రమున ఆగ్నేయము మున్నగు మూలలందును, మధ్యకర్ణికయందును, తూర్పు మొదలగు దిక్కులందును, ఊర్ధ్వ అధోదిక్కులందును, కరన్యాసాదికమును హృదయాదిన్యాసమును చేసినట్లు భావించి చివర "అస్త్రాయఫట్"అని అస్త్రమును పూజించి, (ఆవాహనచేసి) ఆపైన గంధధూపదీప నైవేద్యములతో సూర్యభగవానును పూజించవలెను. వేదమందు చెప్పబడిన సౌరాష్టాక్షరీ మంత్రమును యథాశక్తిగా జపించవలెను. ఆ తరువాత భూమియందు శిరము మోపి నమస్కారములు చేయవలెను. ప్రదక్షిణము చేసినచో భూప్రదక్షిణ యాత్రాఫలము దక్కును.భానువారము, సప్తమి, మాఘమాసము కలిసివచ్చిన నాడు ఈవిధముగా సూర్యారాధనము చేసి నమస్కారములు చేసినవాని యింట దారిద్ర్యముండదు. వ్యాధులుండవు. సమస్త రోగములును నశించును.

ఆరాధకుడు సూర్యారాధనము చేయురోజున ఉపవాసముండవలెను. ప్రతిదినమును ఉదయవేళ స్నానముచేసి, సూర్యునికి అర్ఘ్యమియ్యకుండ మిగిలిన పనులేమియును జేయరాదు. అనగా సంధ్యావందనముచేసి, సూర్యునికి అర్ఘ్యమిచ్చి, సావిత్రిని జపించి గాని మరే పనికిని పూనుకొనరాదని భావము. (సూర్యయంత్రమునకు తెల్లని ఎఱ్ఱని పసుపుపచ్చని మృత్తికలను (రంగులను) వాడవచ్చునని తెలియుచున్నది.) సూర్యాలయమున శ్వేతరక్తపీత మృత్తికలచేత అనులేపనము చేసినచో వాంఛితములు తీరును.

సూర్యుని ద్వాదశమూర్తులు

" సుష్ఠు ఈరణం గతిః యస్యాసౌ సూర్యః " (కాలోచితమైన చక్కని గమనము గలవాడు కావున సూర్యుడు.) అనియు, "సుష్ఠు ఈరణం(ప్రేరణం యేనాసౌ సూర్యః" (సకల జీవరాసులకును మంచి చైతన్యము ఎవనిచేతగలుగునో అతడు సూర్యుడు) అనియుసూర్యశబ్దమునకునిర్వచనములుకనబడుచున్నవి.కావునఆ సూర్యుడే పరబ్రహ్మ స్వరూపుడని యీ పురాణమున ప్రతిపాదింపబడుచున్నది. అతని వలననే యీ సృష్టిజరిగి, పోషింపబడుచున్నది.

" యాభిరాదిత్యస్తపతి రశ్మిభిస్తాభిః పర్జన్యోవర్షతి, పర్జన్యే నౌషది వన స్పతయః ప్రజాయంతే, ఓషది వనస్పతిభి రన్నంభవతి, అన్నేన ప్రాణాః. అన్నాత్ పురుషః ", అని వేదము (శ్రుతి).

అనగా : సూర్యుడు తన కిరణములచేత తపింపజేయుచు భూమిమీది నీటిని ఆకర్షించి మేఘాలలో నిలుపును;అర్పుడా మేఘాలు వర్షించును;వర్షముచేత సస్యములును, వృక్షములునుమొలచును;వానివలనఆహారము(అన్నము)ఏర్పడును.అన్నమునుండియే సమస్త ప్రాణులను పుట్టును. అని యర్థము కావున ప్రాణి సృష్టికి మూలమైనవాడు సూర్యుడే కావున ఆతడే పరతత్త్వము.

అటువంటిసూర్యుడుపం(డెండురూపములుగావిడివడి, ఆరాధింపబడును.ఆ రూపములు

1. ఇంద్రుడు : స్వర్గాధిపతియై దుష్టశక్తులను సంహరించును.
2. ధాత : ప్రజాపతియై భూతములను సృష్టిచేయును.
3. పర్జన్యుడు : తన కిరణములతో నీటిని ద్రావి, తిరిగి మేఘరూపమున వర్షించును.
4. త్వష్ట : ఓషధులయందును, వృక్షములందును ఫలించెడి శక్తి.
5. పూష : ప్రాణుల అన్నములందుండి పుష్టిని గలిగించును.
6. అర్యముడు : దేవతారూపమున నుండును.
7. భగుడు : ప్రాణుల శరీరములలో నుండి, వానిని పోషించును.
8. వివస్వంతుడు : ప్రాణులు తిన్న ఆహారములను జీర్ణము చేయుచుండును.
9. విష్ణువు : శత్రునాశనము చేయును.
10. అంశుమంతుడు : గాలిలో నిలిచి, ప్రాణుల శ్వాసలకు ఆధారమై సుఖమునిచ్చును.

11. వరుణుడు : జీవులు త్రాగెడి నీటిలో ఉండి, వారిని రక్షించును.
12. మిత్రుడు : లోకములకు మేలుచేయుచు చైతన్యము నిచ్చును.

ఈ సూర్యభగవానుడు, వసంతమున కపిలవర్ణముతోను,గ్రీష్మమునబంగారురంగుతోను, వర్షర్తువున తెల్లరంగుతోను, శరత్తున గోరోజన వర్ణముతోను, హేమంతమున రాగి రంగుతోను, శిశిరమున లేతయెరుపురంగుతోను ప్రకాశించును.

ఈ సూర్యునకు మరి పండ్రెండు పేరులు గలవు. వానిని స్మరించినచో మహాపాతకములు నశించును.

ఈ పండ్రెండు నామములేవియనగా :

1. ఆదిత్యుడు 2. సవిత 3. సూర్యుడు 4. మిహిరుడు 5. అర్కుడు 6. ప్రభాకరుడు 7. మార్తండుడు 8. భాస్కరుడు 9. భానుడు. 10. చిత్రభానుడు 11. దివాకరుడు 12. రవి.

మొదట చెప్పిన పండ్రెండు నామములతో సూర్యుడు, పండ్రెండు మాసములలో ఉండుచు, కాలచక్రమును నడుపుచుండును.

1. చైత్రమాసమున - విష్ణువుగాను
2. వైశాఖమున - అర్యముడుగాను
3. జ్యేష్ఠమున - వివస్వంతుడుగాను
4. ఆషాఢమున - అంశుమంతుడుగాను
5. శ్రావణమున - పర్జన్యుడుగాను
6. భాద్రపదమున - వరుణుడుగాను
7. ఆశ్వయుజమున - ఇంద్రుడుగాను
8. కార్తికమున - ధాతగాను
9. మార్గశిరమున - మిత్రుడుగాను
10. పౌష మాసమున - పూషగాను
11. మాఘమాసమున - భగుడుగాను
12. ఫాల్గుణమాసమున - త్వష్టగాను

సంచరించుచు, లోకములకు శుభములు గలిగించుచుండును.

సూర్యునకు మార్తండుడు (మార్తాండుడు) అను పేరువచ్చుట కొక కారణమున్నది. (పూర్వము అదితి సంతానము కోరినదై కశ్యపునితో సంసారము చేసెను. ఆమెకు రెండు అండములు (గ్రుడ్లు) పుట్టెను. అందొక గ్రుడ్డు పుట్టుకతో జీవములేనిదిగా కనబడెను. అందుచేత అదితి దానిని విసర్జించెను. అయితే స్వప్రకాశముగల సూర్యుడు దానినుండి తరువాత వెలువడెను. మృతమైన అండమునుండి వెలువడినవాడు కావున మార్తండుడని పిలువబడినాడు. ఇదియొక కథ.)

అదితి, సూర్యభగవానుడు తన గర్భమున జనింపవలెనని కోరి సూర్యారాధనము చేసెను. కశ్యపుడు కూడ అనుగ్రహించుటచేత అదితికి గర్భము కలిగెను. అదితి ఉపవాసములతోను వ్రతములతోను చిక్కిపోవుచుండుట చూచి యొకనాడు కశ్యపుడు కోపించి "యింత తపముచేసి చివరకు గర్భమును పోగొట్టుకొందువాయేమి?"అని ప్రశ్నింపగా, భర్త తనను పరిహాసము చేయుచున్నాడను రోషముతో "ఈ గర్భము జారిపోయినను లోకములను సంరక్షించునేయుండు"ననుచు గర్భమునందలి అండమును జారవిడిచెను. అది మహాతేజస్సుతో భూమిమీద పడెను. మొదట అది మృత ప్రాయమైనట్లు కనబడినను, తరువాత వేయి సువర్ణకాంతులతో ఒక బాలుడు దానినుండి ఉదయించెను. అదితి "నాథా!నీవు అండమును మారణము చేయుదువా యని యడిగినవావు. అందుడియే యిప్పుడు కొడుకు పుట్టినాడు. కాన ఇతడు "మార్తండుడు"అని పిలువబడునెను.ఇదియే విషయము కొంచెము మార్పుతో వేదములో గూడ ఇట్లు కలదు.

" అష్టౌపుత్రాసో అదితేః, యే జాతాస్తన్వః పరి। దేవా 3 ఉపప్రైత్సప్తభిః। పరామార్తాండ మాస్యత్ ".

తా॥ అదితి ఎనమండుగురు పుత్రులను గని, వారిలో మృతప్రాయమైన అండమునుండి పుట్టిన సూర్యుని విసర్జించి, మిగిలిన వారితో దేవలోకమునకు బోయి నివసించసాగెను.

భూగోళము - వివరములు

మహామునులందరును భూగోళమును, దానిలోని వర్షద్వీపాదులను వివరించి చెప్పుమనగా సూతుడిట్లు చెప్పదొడగెను.

జంబూ ప్లక్షశాల్మలీ కుశక్రౌంచశాక పుష్కరములని యేడు ద్వీపములున్నవి. ఇవియేడుసముద్రములచేఆవరింపబడియుండును. జంబూద్వీపము అన్ని ద్వీపములకు మధ్యనుండును. దీనిలోనే మేరు పర్వతము ఉన్నది. అదిఎనుబది నాలుగుయోజనముల యెత్తుండును. (యోజనము అనగా సుమారు ఎనిమిదిమైళ్ళు ~12.18 కి.మీ) అది ఆకాశమున ముప్పదిరెండువేల చదరపుమైళ్ళ మేర విస్తరించియుండును. భూమికి అది నడి బొడ్డువలెనుండును. దానికి దక్షిణముగా హిమవంతము, హేమకూటము, నిషధము అను పర్వతములుండును. ఉత్తరాన నీల శ్వేత, శృంగములు గల గిరులుండును. ఆ పర్వతములన్నియు చాల ఉన్నతములును విశాలమును అయినవి.

భారతము మొదటి వర్షము. హరికింపురుష వర్షములు మేరువునకు దక్షిణమున నుండును. దానికి ఉత్తరముగా రమ్యక హిరణ్మయవర్షములున్నవి. వీని మధ్య ఇలావృత వర్షము ఉన్నది. దీనిని మేరువు చుట్టియుండును.దానికి తూర్పున మందరపర్వతమును, దక్షిణమున కైలాస గంధమాదనములును, పశ్చిమమున విపులమును, ఉత్తరమున సుపార్శ్వము అను పర్వతములుండును. దానియందు కదంబ, జంబూ, పిప్పల, వట వృక్షములు పదునొకండువందల యోజనముల దాక వ్యాపించియుండును. జంబూ (నేరేడు) వృక్షములుండుటచే దీనికి జంబూద్వీపమను పేరుగలిగెను. ఆ వృక్షములకు ఏనుగులంత ఫలములుండును. అవి రాలిపడినప్పుడు వాని రసముతో జంబూనది పుట్టి ప్రవహించుచుండును. ఆ నదిలోని మట్టి గాలికి ఆరి జాంబూనదమని పిలువబడుచు స్వచ్ఛమైన సువర్ణముగా ప్రసిద్ధికెక్కెను. భద్రాశ్వ, కేతుమాలములనెడు వర్షములును, మరవకములును, హరివర్షములును, జంబూనది మధ్యమున వెలసియుండును.

మేరువు శిరస్సున బ్రహ్మనిర్మితమైన ఒక మహానగరము కలదు. ఆ నగరమునకు అష్టదిక్కులందును అష్టదిక్పాలకుల నగరములుండును. శ్రీహరి, భద్రాశ్వమున హయగ్రీవుడై, కేతుమాలమున వరాహమూర్తియై, జంబూద్వీపమున కూర్మమూర్తియై, మేరు (కురవక) వర్షమున మత్స్యమూర్తియై, ఇతర వర్షములలోను అనేక రూపములు ధరించి విశ్వరూపుడై ప్రకాశించుచుండును.

ఒక జంబూద్వీపము దప్ప తక్కిన ద్వీపములన్నియు దేవతానివాస యోగ్యములై యుండును. అక్కడి వారు, ఆకలిగాని, వార్ధకముగాని రోగములుగాని లేక పండ్రెండు వేల సంవత్సరములు ఆయుర్దాయము కలిగి భోగభాగ్యములతో తుల తూగుచుందురు. కృత త్రేతాది యుగముల కాలప్రమాణములు అచ్చట నుండవు.

భారత వర్షమునకు ఉత్తరమున హిమాలయములును, దక్షిణమున సముద్రమును ఉండును. తొమ్మిదివేల చతురపు యోజనములు దాని వైశాల్యము. స్వర్గము, మోక్షము కోరువారికిది కర్మభూమి. (మిగిలినవి భోగభూములు) మహేంద్ర, మలయ, సహ్య, శుక్తిమత్, ఋక్ష, వింధ్య, పారియాత్రములను ఏడు కులపర్వతములు ఇందుండును. స్వర్గము, నరకము, మోక్షము అనునవి ఇక్కడివారి కర్మాచరణమును బట్టియే కలుగుచుండును. ఇక్కడ తప్ప మరియొకచోట కర్మాచరణమన్నది లేదు.

ఇంద్ర, కశేరు, తామ్ర, గభస్తిమత్, నాగ, సౌమ్య, గంధర్వ, వారుణ భారతములని నవఖండములుగా ఈ భరతవర్షము విభజింపబడెను. మన భారతఖండము ఇందులో తొమ్మిదవది. దీని మూడువైపులను సాగరముండును. ఇదివేయి చతురపు యోజనముల వైశాల్యము గలది.

దీనిలో తూర్పున కిరాతులు, పశ్చిమమున యవనులునుందురు. మధ్యభాగమున బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాది వర్ణములవారు నివసింతురు. వేదములు, ధర్మశాస్త్రములు, ఇతర శాస్త్రములను ఇక్కడ వృద్ధిపొంది వ్యాపించును. మరియు ఇచ్చట గంగ, యమున, సరస్వతి, సింధు, గోదావరి, నర్మద, కృష్ణవేణి, కావేరి, కృతమాల, తామ్రపర్ణి మున్నగు నదులు ఉపనదులతో గలిసి ప్రవహించుచు సాగరములోనికి చేరుచుండును. తూర్పుదేశనివాసులును, కామరూప దేశస్థులును, పౌండ్ర, కళింగ, మగధ, దాక్షిణాత్యులును, సౌవీర, సైంధవాది దేశవాసులును, మద్ర, ఆరామ, అంబష్ఠ, పారశీక నివాసులును, ఈ మహానదుల జలములను త్రాగుచు, వీనివలనగలుగుపాడిపంటలతోసంపన్నులగుచుసంతోషముతోకాలము గడుపుచుందురు.

## భారతవర్ష ప్రశస్తి

ఈ భారతవర్షముననే, కృత త్రేతా ద్వాపర కలియుగములను నాలుగు యుగములు నడచును. ఇక్కడి వారిలోకొందరు సన్న్యాసులై తపము చేసికొందురు. కొందరు యజ్ఞయాగాదులతో దేవతలకు సంతృప్తి కలిగింతురు. కొందరు పరలోకసుఖములకైదానధర్మములుచేయుదురు.పరలోకములకుజేరినవారి ఉత్తమగతులకై కూడ దానధర్మములు చేయుదురు. యాచకులై వారికిలేదనకుండదానములు చేయుదురు. వేదములు చదువుదురు. వానిని శిష్యులకు పాఠములు చెప్పుదురు. చెరువులు త్రవ్వించుట, గుళ్ళు గోపురములు గట్టించుట, బావులు త్రవ్వించుట, మున్నగు లోకోపకారములగు ధర్మకార్యములు చేయుచుందురు. ఇటువంటివన్నియు ఇతర వర్షములలో జరుగవు. అక్కడ నుండువారికి ఆచరణీయములగు సిద్ధులు వేరే ఉన్నవి. వానికిని వీనికిని సంబంధములేదు. జంబూద్వీపములో, కొన్నివేల జన్మలలో చేసిన పుణ్యములకుఫలముగామానవజన్మదొరకును.భారతఖండవాసులుచాలధర్మాత్ములనియు, స్వర్గమోక్షములకు కారణమైన కర్మలాచరింపదగిన జన్మమెత్తినవారనియువీరిని దేవతలే అభినందింతురు. ఈ కర్మభూమిని మించినది వరొకటి లేదని చెప్పుచుందురు.

## ప్లక్షాది ద్వీపములు

ప్లక్షద్వీపము గూడ జంబూద్వీపము వలెనే ఉప్పు సముద్రముచేత ఆవరింపబడియుండును. జంబూద్వీపముకంటెను. రెట్టింపు వైశాల్యము (రెండు లక్షల చ॥యోజనములు) కలిగియుండును. దీనికి మొదటిరాజు మేధాతిథి. అతనికి, శాంతమయుడు, శిశిరుడు, సుఖోదయుడు, ఆనందుడు, శివుడు, క్షేమకుడు, ధ్రువుడు, అను నేడుగురు కొడుకులుండిరి. వీరి పేరుమీదనే ఇక్కడ ఏడు వర్షములు ఏర్పడెను. (వర్షము ౼దేశవిభాగము) ఇచట గోమేద, చంద్ర, నారద, దుందుభి, సోమక, సుమనస్, వైభ్రాజములను కులపర్వతములు గలవు.దేవగంధర్వులను ప్రజలు ఇచట నివసింతురు. వారికి మనస్తాపములు, రోగములు లేవు. సౌఖ్యానుభవమే వారికి సహజము.

అనుతప్త, శిఖి, విపాశ, త్రిదివ, క్రమునామక, అమృత, సుకృత అను యేడు నదులు ఈ ద్వీపమున ప్రవహించును. ఈ నదులపేర్లు స్మరించిన పాపములు పోవును. ఇక్కడ యుగావస్థలు లేవు. ఎల్లప్పుడు త్రేతాయుగము నందువలెధర్మములు నడచుచుండును. ప్రజలు 5వేల సంవత్సరములు జీవింతురు. ఆర్యక, కురు, వివిశ్వ, భావి నామములతో నాలుగు వర్ణములవారు నుందురు. ప్లక్షవృక్షములు (జువ్విచెట్లు) ఉన్నవి గాన దీనికి ప్లక్షద్వీపమని పేరు గలిగెను.

శాల్మలద్వీపము : దీనికి పాలకుడు వీరుడు. దీనిలోగూడ, శ్వేతము, హరితము, జీమూతము, రోహితము, వైద్యుతము, మానసము, సుప్రభము అను ఏడు వర్షములు గలవు. శాల్మల (బూరుగు) వృక్షములుండుటచే ఈ ద్వీపమునకు అదే పేరువచ్చెను. ఇక్షు (చెఱకు) రససముద్రము దీనిచుట్టు నుండును. ఉన్నతము, మూహకము, ఓషధీనిలయమైన ద్రోణము, కంకము, మహిషము, కుకుద్మంతము అను పేరుగల కులపర్వతముల్చిటనుండును. శ్రేణి, తోయ, వితృష్ణ, చక్ర, శుక్ర, విమోచని, నివృత్తి అను ఏడునదులు ఇచట ప్రవహించును. కపిలులు, అరుణులు, పీతవర్ణులు, కృష్ణవర్ణులుఅను పేరులతో బ్రహ్మ క్షత్రియ వైశ్యశూద్రులు అను చతుర్వర్ణములవారును ఉందురు. వారక్కడ విష్ణువును పూజింతురు. యజ్ఞయాగములు చేయు ఉద్దేశ్యము గలవారు, వాయుభూతునిగా భగవంతు నారాధించుచు అతనికి ప్రీతిగా (మానసిక) యజ్ఞములను చేయుదురు. ఇందుండువారు ఐదువేల సంవత్సరములు జీవింతురు.

కుశద్వీపము : కుశద్వీపము సురాసముద్రముచే ఆవరింపబడి యుండును. శాల్మలీ ద్వీపము కంటె రెంట్టింపు వైశాల్యము కలది. దీనియందును ఏడు వర్షములు గలవు. ఉద్భిదము, వేణుమంతయు, స్వైరథము, వితతము, రంధనము, ధృతి మున్నగు ఏడు పర్వతములు గలవు. అచట దేవదానవులతో పాటు కొందరు పుణ్యాత్ములైన మనుష్యులును, గంధర్వులును గూడ ఉందురు. దమి, శుష్మి, స్నేహ, మందేహా నామములతో బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులు ఉందురు. వారు బ్రహ్మరూపుడైన జనార్దనుని ఆరాధింతురు. అధికారములకై ఎగబడరు. ధృతపాప, శివ, పవిత్ర, సమ్మతి, విద్యుత్తు, అంభస్తు, మహీ అను ఏడునదులు అచట గలవు. కుశస్తంభములు (దర్భకాడలు) ఎక్కువగా ఉండుటచే దీనికి కుశద్వీపమను పేరువచ్చెను.

క్రౌంచద్వీపము : క్రౌంచద్వీపము, కుశద్వీపము కంటె రెంట్టింపు వైశాల్యముండును. దీనిచుట్టును ఘృత (నేతి) సముద్రము ఉండును. కుశగము, రుందము, గోష్ఠము, పీవరము,అంధకారకము,భూరిరూపము,దుందుభిఅను ఏడువర్షములు అచటనుండును. క్రౌంచము, వామనము, అంధకారకము, దేవవ్రతము, ధమము, పుండరీకవంతము అను ఏడు కులపర్వతములు ఉండును. ఒక ద్వీపము, వర్ష పర్వతములు, సముద్రములు, అవల నింకొక ద్వీపముగా ఈ ద్వీపములన్నియు భూమాండలమున అమరియుండును. అచట దేవగణములు ప్రజలుగానుందురు. గౌరి, కుముద్వతి, సంధ్య, రాత్రి, మనోజవ, ఖ్యాతి, పుండరీకము అను పేరులు గల నదులు ప్రవహించుచుండును. ఆనదీజలములనుత్రాగుచుఆరోగ్యభాగ్యములు పొందుచుందురు.

అచట జనార్దనుడు, యోగరుద్రరూపుడై ఆరాధింపబడుచుండును.

శాకద్వీపము : శాకద్వీపాధిపతికి ఏడుగురు పుత్రులుండిరి. వారిపేర్లు, జలదుడు, కుమారుడు, సుకుమారుడు, మనీరకుడు, కుసుమయోదుడు, మోదకి, మహాద్రుముడు. వీరిపేర్లతోఆశాకద్వీపమునందలివర్షములుప్రఖ్యాతినిపొందెను.ఏడుకులపర్వతములుండును. అవి, ఉదయగిరి, జలధారము, రైవతకము, శ్యామము, దంభోగిరి, ఆస్తికేయము, కేసరి అనునవి. శాకవృక్షములు (టేకుచెట్లు) అధికముగానుండుటచే దీనికి శాకద్వీపమను పేరు గలిగెను. అచటగూడ నాలుగు వర్ణాలవారును ఉందురు. వారికి అలసత్వము (బద్ధకము) గాని, జడత్వముగాని ఉండదు. వ్యాధులుండవు. మంచి స్వభావములతో కాంతిగల దేహములతోఅచటిప్రజలుపరస్పరమైత్రితో ఉందురు. అక్కడ సమస్తపాపహరములును, పుణ్యప్రదములైన నదులు ఏడు ఉన్నవి. అవి : సుకుమారి, కుమారి, నళిని, రేణుక, ఇక్షువు, ధేనుక, గభస్తి అనునవి. అచటి ప్రజలకు అధర్మము, దుఃఖము, అనారోగ్యము అన్ననేమో తెలియదు. వారు నిత్యసుఖ జీవనులైయుందురు. మగములు, మగధములు, మానసములు, మందగములు అను నాల్గు వర్ణములుగా వారు ఉందురు.

పుష్కరదీపము : పుష్కరదీపము, శాకద్వీపముకంటె రెట్టింపు ప్రమాణము గలది. దీనికి అధిపతి సవనుడు. అతనికి మహావీతుడు, ధాతకి అను ఇద్దరు కొడుకులు గలరు.

వారిద్దరి పేరులమీద రెండు వర్షములు వెలసినవి. అక్కడ మానసోత్తరమను మహాపర్వతము గలదు.అది, మహావీత, ధాతకీ వర్షములను రెండుగా విభజించుటకు మహాపర్వతము గలదు.

అది, మహావీత, ధాతకీ వర్షములను రెండుగా విభజించుటకు బ్రహ్మదేవుడేర్పరచిన సరిహద్దువలె నుండును. అక్కడి ప్రజలు పదివేల వర్షములు జీవించెదరు. వారికి రోగములు ఉండవు. శోకముండదు. రాగద్వేషములు ఉండవు. వీరు అధములు, వీరు ఉత్తములు అను వర్గభేదములుండవు. ఈర్ష్యాసూయలు, భయము, రోషము, లోభము, ఆ ప్రజలలో మచ్చుకైనను కనిపించవు. ఇచట సురలును, అసురులను, యక్షులును పరస్పరమైత్రితో మెలగుచుందురు. అసత్యముగాని, అనృతముగాని అచటలేవు. (అసత్యము ౹సత్యముకానిది పలుకుట, అనృతము ౹సత్యముకాని దానిని మనసునందు భావించుట.)అచట కులపర్వతములు లేవు. నదులు కూడ లేవు. పుణ్యపురుషులు దేవతలవలెనేవేషములుధరించివారితోసమానముగానుందురు.అక్కడవర్ణాశ్రమాచారములు లేవు. వేసవికాలము, వర్షాకాలము, శీతాకారము అను భేదములుండవు. రోగములు లేవు. ముసలితనము లేదు. అదియే స్వర్గమని పిలువబడును. అక్కడ నొక పెద్ద మఱ్ఱివృక్షము గలదు. ఆ చెట్టుమొదట బ్రహ్మ, తన నివాస మేర్పరచుకొనెను. దీనిచుట్టును మంచినీళ్ళ సముద్రము ఆవరించియుండును.

ప్రజలు వారు కోరినంతనే భోజనము లభ్యమగుచుండును. నేలయంతయు బంగారు రూపమే. జంతువులు ప్రజలను బాధింపవు. దాని తరువాత చక్రవాళశైలము ఉన్నది. అది పదివేల యోజనముల పోడవు గలది. అది అంధకారములోనుండును. అందుచే జనుల కది కనిపించదు.

క్రౌంచద్వీపముగాక, యితరద్వీపములందలి సముద్రములకు ఆటుపోటులుండును. శుక్లపక్షకృష్ణపక్షములందుచంద్రుని వృద్ధి క్షయములను బట్టి ఇవియు వృద్ధిక్షయములను పొందును.

క్రౌంచ ద్వీపమును జుట్టియున్న సముద్రమునకు అటువంటి ఆటుపోటులు లేవు.

ఈవిధముగాసప్తద్వీపములతోగూడినభూమండలముకొలతఏబది

కోట్లయోజనములుండును.

ఆ భూమియే సర్వప్రజలకును, జంతుజాలమునకును నదీనదారణ్యసముద్రాదులకును ఆధారమని గ్రహింపవలయును.

అని సూతుడు చెప్పగా విని మునులందరును సంతోషపరవశులైరి.

రుద్ర మాహాత్మ్యము - గౌరీ శంకరులు

సూతుడు మరల నిట్లు చెప్పసాగెను. మునులారా!ఈశ్వరుని మహిమ ఇంతయని చెప్పలేము. ఆయనను గూర్చి చెప్పెదను వినుడు.

పరమేశ్వరుడు దక్ష ప్రజాపతి కుమార్తెయైన సతీదేవిని వివాహమాడెను. ఇతడు, మిగిలిన తన అల్లుండ్రవలె సంపన్నుడు కాడని దక్షునికొక చిన్నచూపు. ఒకమారు యజ్ఞముచేయుచు సతీదేవిని దప్ప మిగిలిన కుమార్తెలను పిలిచి, వారికి వస్త్రములు, ఆభరణములను కోరినవి యిచ్చి సంతోషపరచెను. ఈవిషయము సతీదేవికి తెలిసెను. వెంటనే ఆమె తండ్రియింటికి పిలువకుండగనే వెళ్ళెను. దక్షుడామెను. పలుకరించలేదు. సతీదేవికి రోషముగలిగి, "తండ్రీ!నేను కుమార్తెలోనికెల్ల పెద్దదానను. నన్ను ఇంతమంది ముందుచులకనచేయుటయుక్తముగాదు"అనగాదక్షుడుకోపముతో "నా పుత్రికలందరును గుణవతులు, అల్లుండ్రు కొందరు తపోనిష్ఠులు, కొందరు మహైశ్వర్యసంపన్నులు. నాయందు గౌరవభావము గలవారు. నీ భర్త అయోగ్యుడు. నన్ను గౌరవింపడు, నమస్కరింపడు;తక్కినవారితోనైన సఖ్యముగానుండడు.అటువంటిశివునితో సంబంధమున్నందువలన నీవుగూడ నాకు అనిష్ఠురాలవైతివి"అనెను. అది విని సతి, "నీవు, మహోన్నతుడును, పరమపురుషుడునైన నా భర్తను నన్నును దూషించితివి. కావున నీవలన జన్మించిన యీ దేహమును ఇప్పుడే విడుచుచున్నాను"అనుచు, " నేనెప్పుడును సతీత్వధర్మము నాశ్రయించియుంటినేని మరల నాకు శంకరుడే పతి యవుగాక"అని భర్తను మనసులో ధ్యానించుచు తన శరీరమును యోగాగ్నిలో భస్మము చేసెను.

శంకరుడీ వృత్తాంతమునంతను విని, ఈ మునులు అందరును వైవస్వతమన్వంతరములోమానవులై అయోనిజులుగా బుట్టుదురు. నీ యజ్ఞసయములో వచ్చి, ఋత్విజులై సభాసదులైయుండి శివపత్ని అవమానముతో దేహత్యాగము చేయుచుండగా చూచుచు ఊరకున్నందుకు వీరందరును ఈ శాపమును భరింపవలెను. ఇంక దక్షుడు ఆ మన్వంతరములో ప్రాచీనబర్హికి పౌత్రుడై ప్రచేతసుడను రాజునకు పుత్రుడై జన్మించును. అప్పుడు అతడు చేయు యజ్ఞమును ధ్వంసముచేయుదును. ఏ ధర్మకార్యము దక్షుడు చేయబోయినను అడ్డుపడి నాశనము చేయుదును"అని శపించెను. దక్షుడది తెలిసికొని "ప్రజలు యజ్ఞయాగాదులు చేయుచు హవిర్భాగముల నిచ్చునపుడు నిన్ను విడుతురు.

ఒకవేళ నీకు ఆహుతి ఇయ్యక తప్పని సరియైనచో, ఇచ్చిన వెంటనే చేతులు అపవిత్రములైనట్లు భావించి నీళ్ళతో కడుగుకొందురు"అని శపించగా రుద్రుడు "దేవతలతో బాటు హవిర్భాగములు పుచ్చుకొనుటకు నేనిష్టపడను. నాకు చెందవలసినదానిని నేను వేరుగా పుచ్చుకొందును. లోకములలోనికెల్ల భూలోకము ఉత్తమము.నేనుభూలోకమునందున్నచోదానికిస్థిరత్వముకలుగును.గానఅచ్చటనుందునే కాని నీకు భయపడి మాత్రము కాదు"అనెను.

దక్షుడు శివుని శాపముచేత భూమియందు పుట్టెను.

దక్షశంకరులకు ఈ శాపములు శాశ్వత వైరకారణములయ్యెను. దక్షునకు జన్మము మారినను వైరము వాసనారూపముగా అతనిని విడువకుండెను.

అని సూతుడు చెప్పగావిని, మునులు ఆ సతీశంకరుల వృత్తాంతము చెప్పుమనగా, ఈ కథ మునుపు బ్రహ్మ, మహర్షులకు చెప్పినాడు, అదే మీకు వినిపింతుననుచు సూతుడు చెప్పసాగెను.

హిమవంతుడు పర్వతరాజుండెను. అతని భార్య మేన. అతనికి సంతానము కలుగలేదు. ఒకనాడు కశ్యప్రజాపతి అతని యింటికి వచ్చెను. శైలరాజు అతనికి మర్యాదలు చేసి యిట్లనెను. "ఓ మునీంద్ర!దేనివలన అక్షయపుణ్యలోకములు కలుగును?దేనివలన కీర్తి ప్రాభవములు కలుగును?సెలవిండు".

అంతకశ్యపుడు,"నాకుఉత్తములైనకుమారులు(దేవతలు)జన్మించుటచేతప్రజాపతిత్వము, గౌరవము కలిగినవి. నీవును సంతానభాగ్యమును తపముచేసి పొందుము". అని చెప్పివెళ్ళెను. హిమవంతుడు బ్రహ్మనుగూర్చి తపముచేయగా అతడు ప్రత్యక్షమై, నీకొకకొడుకును,ఒకకూతురునుజన్మింతురు.ఆ కూతురి వల్ల నీవు కీర్తిమంతుడవగుదువు. ఆమె దేవతలచేత గూడ నమస్కరింపబడునదై యుండును"అని వరమిచ్చెను. ఆనాడు యోగాగ్నిలో తన శరీరమును దహింపజేసికొన్న సతీదేవి హిమవంతునకు కుమార్తెయై పుట్టెను. ఇప్పుడామె "ఉమ"అని పిలువబడుచుండెను. ఆమె మహానుభావురాలు. ఆమె యాత్మ మూడు విధములుగా రూపొందెను. అపర్ణ, ఏకపర్ణి, ఏకపాటల అని వారి పేరులు. అపర్ణయే ఉమ. ఆమె శంకరుని విడిచియుండలేక మహాతపస్సు చేయుటకు పోవుచుండగా తల్లి నివారించి "తపము వద్దు"(ఉ=తపము, మా=వలదు) అనెను. కాని ఆమె నిశ్చయమును జెప్పి ఆమె అనుమతితో తపముచేయుటకు వెళ్ళెను. ఏకపర్ణి, ఏకపాటలయుగూడ తపస్సునకు వెళ్ళిరి. ఆ ముప్పురును లోకమాతలు.

ఉమ మహాదేవునాశ్రయించెను. ఆమె తపస్సునకు లోకములు హాహాకారము చేసినవి. అప్పుడు బ్రహ్మ ఆమెక ప్రసన్నుడై "అమ్మా!నీవు జగజ్జననివి. నీవల్ల ఈలోకములు నశింపరాదుగదా!తపము చాలింపుము"అనగా ఆమె "పితామహా! నేనేమి కోరి తపము చేయుచున్నానో నీకు తెలియదా?"అని యడిగెను. బ్రహ్మదేవుడు "అమ్మా!నీవు కోరినవాడు నిన్ను వెదకుకొనుచువచ్చి వరించును. ఏ రూపమున వచ్చి నిన్ను అనుగ్రహించునో తెలియదు. మేము శివుని చరణసేవకులముగదా!"అనెను. మునులు వచ్చి ఆమెతో "నీవు కోరుకొన్న శంకరుడే నీకు పతియగును. ఇంక నీ తపము చాలింపుము"అనిరి.

ఒకనాడు ఒక వామనుడు అచటికి వచ్చెను. అతని కాళ్ళు పొట్టివి. చేతులు పొట్టివి. తల తుప్పవలెనుండెను. ముక్కు వంకర తిరిగియుండెను. ఏ వైపునుండి చూచినను చాల అసహ్యముగా నుండెను. అతడు మెల్లగా పార్వతియొద్దకు వచ్చి, "ఉమా!నిన్ను వరించుటకు వచ్చినాను"అని పలుకగా, పార్వతి అతనిని తన యోగమహిమచే పరమశివునిగా గుర్తించెను. అవునుమరి. పరమశివుడు ధరింపని రూపమేమున్నది? "నమోహ్రస్వాయచ వామనాయచ"అని శ్రుతి చెప్పెను గదా!.

పార్వతి, అతనిని అర్ఘ్యపాద్యాదులతో పూజించి, "స్వామీ!నే నస్వతంత్రురాలను, నన్ను ఇచ్చుటకు నా తండ్రియున్నాడు. నా తండ్రి ఆమోదించినచో నేను నిన్ను వివాహమాడెదను"అని పలికెను. ఆమె ధర్మయుక్తముగా పలికిన మాటలకు సంతోషించి ఆ కపట వేషధారి, "అయినచో నేను హిమాచలాధీశునే అడిగెద"నని వెళ్ళి, హిమవంతునిచేత పూజితుడై, తనకు అపర్ణ నిమ్మని అడిగెను. హిమవంతుడు ఆలోచనలో పడెను. "ఇతని రూపము పరమవికారముగానున్నది. ఇతనికి నా కుమార్తెను ఎట్లు ఈయగలను?కాదు పొమ్మనిచో ఇతడు శపించిపోవునేమో"అని తలచి, ఆ వామనునితో నిట్లనెను. "అయ్యా!నీవు నా కుమార్తెను ఇమ్మనుచున్నావు. నేను నా కుమార్తెకు స్వయంవరము చాటింతమను కొనుచున్నాను. నీవు స్వయంవరమునకు రమ్ము. అచ్చట నీ అదృష్టమును పరీక్షించుకొనుము". ఈ మాటలు విని ఆ కుబ్జుడు, పార్వతి దగ్గరకు వెళ్ళి, "అపర్ణా!నీ తండ్రి నీకు స్వయంవరము చాటించునట. అందులో నీవు ఎవరిని వరింతువో అతడే నీ భర్తయగునట.ఈ సంగతి చెప్పిపోవుదమని నీ దగ్గరకు వచ్చినాను.

మన్మథునివంటి వానిని నీవు వరించెదవుగాని నావంటి వికృతరూపము గల వానిని వరింతువా? సెలవిచ్చినచో పోయివత్తును"అనెను. ఉమ అతడు చెప్పినది విని, "ఓ స్వామీ!నిన్ను శంకరునిగా గుర్తించితిని. నాపై నీకుగల అనురాగమునకు సంతోషించితిని. నేనెవ్వరినో ఎందుకు వరించెదను?నీవే నా భర్తవు. నీకు విశ్వాసము కలుగుటకు ఇప్పుడే నిన్ను వరించెదను"అనుచు ఒక పుష్పహారమును ఆ నీలకంఠుని మెడలో వేసెను. అతడు, "నన్ను ప్రీతితో వరించినావు గావున నీకు ముసలితనమును, మరణమును లేకుండ వరమునిచ్చుచున్నాను. నీవు తపస్సుచేసిన యీ వనము ఇంక చిత్రకూటమని పిలువబడును. ఈ వనమునకు, దేవతాపూజకై యెవడు పుష్పములు గోయవచ్చునో అతడు అశ్వమేధఫలమును బొందును. ఎవడీ గిరిశిఖరమున తపముచే యుచు ప్రాణములు విడుచునో అతడు ప్రమథగణములలో ముఖ్యుడగును"అనెను.

పార్వతి ఆ పర్వతశిఖరమునందే కూర్చుండి పరమేశ్వరుని ధ్యానించుచుండెను. ఆ పర్వత సమీపమున ఒక తామర చెఱువు గలదు. ఒకనాడు శివుడు ఒక బాలకుని రూపముతో ఆ చెఱువులోదిగి జలక్రీడలు సలుపుచుండగా అందున్న మొసలియొకటి అతనింబట్టుకొనెను. బాలుడు పెద్దగా ఏడ్చెను. అదివిని పార్వతి ఆ కొలని యొద్దకు వెళ్ళి చూచెను. "అయ్యో!ఈ మొసలి నన్ను పట్టుకొన్నది. ఎవరైన పుణ్యాత్ములు వచ్చి నన్ను కాపాడరా?నేను నా తల్లిదండ్రులను గూర్చి విచారించుచున్నాను. వారికి నేనొక్కడనే పుత్రుడను. నా మరణవార్త విని వారుకూడ మృతినొందుదురు. దైవనిర్ణయమును కాదనగలవారెవ్వరు?"అని విచారించుచుండెను.

పార్వతి, ఆ మొసలితో "ఓ నక్రమా!నీవేల యీ బ్రాహ్మణవటువును మ్రింగుచున్నావు?కనికరించి విడిచిపెట్టుము"అనగా మొసలి "తల్లీ!ఇచటికి వచ్చిన ఏ ప్రాణినైనను భక్షించి జీవనము గడుపుకొనుమని బ్రహ్మ నాకు చెప్పెను. ఈనాడు ఈ బాలుడు నాకు దొరకెను. ఎట్లు వదలగలను"?అనెను. పార్వతి యిట్లనెను. "ఓ జలచరమా!నేను హిమవంతుని పుత్రికను. ఈ గిరిశృంగమున నేనిన్నాళ్ళు చేసిన తపము నీకిచ్చెదను. ఈ బాలుని విడిచిపెట్టుము". ఆ మాటవిని మొసలి "నీవు ఉత్తమముగా భావించిన తపము కొంచెమైనను అది నాకిమ్ము"అనగా పార్వతి, "నేను పుట్టినప్పటినుండి యే పుణ్యములు చేసితినో ఆ పుణ్యములను వాని ఫలములను నీకిచ్చుచున్నాను. బాలుని విడువు"మనెను. అందుకు మొసలి, "ఉమాదేవీ!ఇంత కష్టపడి చేసిన తపమును వదులుకొందువా?పెద్దలు విన్నచో నిన్నుమెచ్చరు.

పార్వతి తిరిగి ఘోరతపముచేయ నారంభించెను. పరమేశ్వరుడు ప్రత్యక్షమై "అపర్ణా! నీవు తపఃఫలమును ధారపోయగా దానినంతను నేను గ్రహించితిని. అది నీకు అక్షయమగు ఫలమునిచ్చును. ఇంత నీ తపము మానుము"అని పలుకగా పార్వతి తన తపము ఫలించినందుకు అమితానందముపొందెను.పర్ణమనగా ఆకు.తపముచేయువారు ఆకులు అలములు తిందురు. ఈమె తపముచేయునప్పుడు ఆకులు గూడ తినక ఉపవాసములతోనుండెను. మునులీమెను "అపర్ణ"యనిరి.

పార్వతీ స్వయంవరము

ఆనాడు హిమవత్పర్వత రాజు రాజధానియైన ఓషధిప్రస్థము చాల సందడిగానున్నది. ఎవని నోటవిన్నను పార్వతీస్వయంవర మహోత్సవ వార్తలే. రాజుగారి యింట శుభకార్యము జరుగుచున్నది అన్నచో ప్రజలకు కూడ సంబరమే. ఆ సంరంభము చూడవలసినదేకాని వర్ణింపనలవికాదు.

పార్వతి కైలాసవాసుని వరియించిదన్న విషయము హిమవంతునికి తెలియును. ఆనాడు, తన యొద్దకు వికారరూపములో వచ్చి, పార్వతిని తనకిచ్చి పెండ్లిచేయుమన్నవాడు కూడ ఈశ్వరుడేమో అన్న అనుమానము లేకపోలేదు. అయినను, తాను మొదట ఉద్దేశించిన ప్రకారము స్వయంవరము చాటించుటకే నిశ్చయించుకొనెను. తన కుమార్తె శివునే వరింపనిమ్ము. తన కభ్యంతరమేమి? అంతమంది యెదుట పరమేశ్వరుడు తన కుమార్తెను వివాహమాడుట తనకు గౌరవమేకదా!ఇట్టి యాలోచనతో భూలోకమందును స్వర్గాది సర్వలోకములందును తన కుమార్తెస్వయంవరమునుచాటించి,బ్రహ్మవిష్ణుమహేశ్వరులకును,ఇంద్రాది దిక్పాలకును, వసువులు, ఆదిత్యులు, మరుద్గణములు అందరికిని, ఆహ్వానము లంపెను.

స్వయంవరము నాటికి ఇంద్రుడు మహావైభవముతో ఐరావతమునెక్కి వచ్చెను. నీలశరీరకాంతితో మహిషమునెక్కి యమధర్మరాజు వచ్చెను. వరుణుడు, కుబేరుడును తగిన పరివారములతో వచ్చిరి. గరుత్మంతునిపై నెక్కి పీతాంబరముతోను, శంఖచక్రాది లాంఛనములతోను శ్రీ మహావిష్ణువును, హంసవాహనముపై బ్రహ్మయు చనుదెంచిరి. గంధర్వరాజైన చిత్రరథుడు విమానము నెక్కివచ్చెను.

స్వయంవర సమయ మాసన్న మైనది. ఇంతమంది వచ్చినను కైలాసగిరినుండి పరమేశ్వరుడు రాలేదు. పార్వతి సభాభవనములోనకి పుష్పమాలికి చేతబట్టుకొని వచ్చి ఒక ఆసనముపై కూర్చుండెను.

ఇంతలో ఒక శిశువు ఆమె ఒడిలో వ్రాలెను. పార్వతి ఆ శిశువు వంక నిదానించి చూచి, అతడు, తాను వరింపదలచిన పరమేశ్వరుడేయని యోగశక్తిచే తెలిసికొని, తన పుణ్యములు పండెనని ఆనందించి ఆ బాలకుని మెడలో హారమువేసి వరించెను. ఇంద్రాదిదేవతలు ఆ బాలుడే పరమేశ్వరుడని గ్రహింపలేక క్రోధావిష్టులైరి. వారిలో దేవేంద్రుడు మొదటివాడు. ఆబాలుని వజ్రాయుధముతో కొట్టబోయెను. కాని అతని సర్వాంగములును స్తంభించి శిలాప్రతిమవలెనైపోయెను. భగుడనువాడు గూడ అట్లే అయ్యెను.

విష్ణుమూర్తి అది చూచి, ఆ బాలకుడు శంకరుడని గ్రహించి తలయూచెను. బ్రహ్మదేవుడుగూడ, దేవతల యోగబలమునే స్తంభింపజేయు ఈతడెవరని చింతించి ఆ కుమారుని పరమశివునిగా తెలిసికొని స్తోత్రములు చేసి, "పరమపురుషుడైన నీ యెడల కీడుతలపెట్టిన మూర్ఖులకు తగిన శిక్షయే లభించినది"అని పలుకుచు ఇంద్రాది దేవతలను కనుగొని, "మీరు మహాదేవునికి అపకారము తలపెట్టిరి. అది మీకు శ్రేయస్కరముకాదు. ఆ మహేశ్వరుని భక్తితో సేవింపుడు"అని హితము చెప్పగా వారు అట్లుండియే యీశ్వరుని మనస్సులో ధ్యానించిరి. శంకరుడు దయామయుడు గావున వారి దురవస్థను మాన్పి, బాలకుని రూపమును వదలి సర్వజనమనోహరమైన రూపమును ధరించెను. దేవతలకును సభాసదులకును తన దివ్య విరాడ్రూపమును ధరించెను. హిమవంతునితో సహా దేవతలందరును ఆయనకు ప్రణామములాచరించిరి. అంతట, సభ్యులెల్లరును హిమవంతునితో, "ఇటువంటి మహానుభావుడు నీకు అల్లుడైనందువలన నీ జన్మము ధన్యమైనది. ఇంక పెండ్లియేర్పాటులు త్వరగా చేయు"మనిరి. పర్వతరాజు బ్రహ్మను జూచి "చతురాసనా!అన్నింటికిని నీవే ముఖ్యుడవు. కావున బ్రహ్మత్వము వహించి యీ వివాహ మంగళకార్యమును నీవే నడిపింపవలయును"అనగా బ్రహ్మదేవుడందు కంగీకరించెను. నగరమంతయు అలంకరించిరి. సూర్యచంద్రులు తమ కాంతులచేత ఆ నగరమను అహోరాత్రులు ప్రకాశమానముగాజేసిరి.అప్సరసలునాట్యముచేసిరి.గంధర్వులుపాడిరి.దేవదుందుభులు మ్రోగినవి. కల్యాణమండపము వద్ద దేవతలు మునులు అందరును ఆసీనులై వేదమంత్రములు ముక్తకంఠముతో చదివిరి. మేనాహిమవంతులు కన్యాదానము చేసిరి.

బ్రహ్మ అగ్నియందు అజ్యాహుతులు వ్రేల్చెను. వధూవరులకు పాణిగ్రహణము చేయించి అగ్నికి మూడుసార్లు ప్రదక్షిణము చేయించెను. మహామునీంద్రులు వేదాశీస్సులు పలికిరి. దేవతలందరును నూతన వధూవరులకు వస్త్రమణిభూషణాదులు కానుకలుగానిచ్చిరి. సమస్తలోకములును గిరిజాశంకర కల్యాణసమయమున అనిర్వచనీయానందము ననుభవించెను.

ఈ గౌరీశంకరుల కళ్యాణకథ పరమపవిత్రమైనది. సర్వపాతకములను హరించునట్టిది.

అని సూతుడు మునులకు చెప్పెను.

## మన్మథ దహనము

ఒకనాడు పరమేశ్వరుడు పార్వతితో గలిసి మేడమీద కూర్చుండియుండగా కొందరు మహామునులు అచ్చటికి వచ్చిరి. శంకరుడు వారితో సత్ప్రసంగములు చేయుచుండెను. ఆ సమయములో మన్మథుడు రతిదేవితో కూడి అచటికి వచ్చెను. ఈశ్వరుడు, సమయాసమయములు గుర్తింపకుండ వచ్చిన మన్మథుని జూచి కోపించి, తనమూడవ కంటి అగ్నితో అతనిని కాల్చివేసెను. అట్లు నిర్జీవుడైన తన భర్తను జూచి రతిదేవి, పార్వతీపరమేశ్వరులను దీనాతిదీనముగా ప్రార్థించి, తన భర్తను సజీవుని జేయుమని కోరెను. గౌరీశంకరులు ఆమెనోదార్చి, "మన్మథుడు ఇంక శరీరముతో బ్రతికియుండడు. కాని అనంగుడైకూడ అతడు తన పని తాను చేయుచునేయుండును. శ్రీమన్నారాయణుడు భూమండలములో యదువంశమున వాసుదేవుడై జన్మించును. ఆ శ్రీకృష్ణునకు పట్టమహిషియైన రుక్మిణియందు ప్రద్యుమ్నుడను పేరుతో నీ భర్త జన్మించును. అప్పుడు నీవు మానవకాంతవై అతనిని పెండ్లియాడెదవు విచారము మానుము"అని పంపివేసిరి.

## పురుషోత్తమ క్షేత్రము (పూరీ జగన్నాథము)

మహామునులందరును పురుషోత్తమక్షేత్రమును గురించి చెప్పుమనగా సూతుడిట్లు చెప్పనారంభించెను.

ఒకప్పుడు మేరుపర్వత శిఖరభాగమునందు సకలదేవతలు, మునిగణములును సేవించుచుండగా లక్ష్మీదేవితో శ్రీమన్నారాయణుడు కొలువుండెను. అప్పుడు లక్ష్మీదేవి తన భర్తను జూచి "భూలోకమును కర్మభూమియందురుగదా!అందు జన్మము లభించుటే పుణ్యవిశేష మందురుగదా!మరి, ఆ భూమిలో జన్మించినవారు చాలమంది కామక్రోధలోభాది షడ్వర్గములకులోనై విహితకర్మములు చేయుట మానుచున్నారు.

ఇదేమి చిత్రమో తెలిసికొనవలెనని యున్నది. దయచేసి నాకు చెప్పు"డని కోరగా శ్రీమన్నారాయణుడిట్లు చెప్పసాగెను.

"పురుషోత్తమక్షేత్రము"అని సముద్రతీరమున నొక పుణ్య క్షేత్రము గలదు. అందు పురుషోత్తముడు నివసించును. దానికి సమానమైన క్షేత్రము మరియొకటి భూమండలమున లేదు. అక్కడ నా విగ్రహము ఇంద్రాదిదేవతలచే, ఎవ్వరికిని కనబడకుండ దాచబడియుండెను. అందుచేత నది క్షేత్రరాజము అని చెప్పబడెను. కల్పాంత ప్రళయమునందు యోగనిద్ర చెందిన నేను ప్రళయానంతరము నిద్రనుండి లేచి, సృష్టిచేయ సంకల్పించి, నాభికమలమునుండి బ్రహ్మను సృజించినాను. అతడు పంచభూతములను, వానినుండి స్థూల సూక్ష్మరూపములైన వస్తుజాలమును సృష్టించెను. అవి చరములనియు అచరములనియు రెండు విధములయ్యెను. బ్రహ్మ మరల ప్రజాపతులను, మరీచిమున్నగు మునివరులను తన సంకల్పముతో సృజించెను. మరియు అండజములు (గ్రుడ్లనుండి పుట్టినవి) జరాయుజములు (మావినుండి పుట్టినవి), స్వేదజములు (చెమటనుండి పుట్టినవి), ఉద్భేదజములు (భూమి నుండి మొలకెత్తినవి) అను నాలుగు విధములయిన జీవరాసులను సృష్టించెను. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు వర్ణముల వారిని, అంత్యజాలను, మ్లేచ్ఛులను గూడ సృష్టించెను. వారికి ఆహారములుగా తృణగుల్మవృక్షలతాదులను సృష్టించెను. తన శరీరమున దక్షిణభాగమునుండి పురుషుని, వామభాగమునుండి స్త్రీని సృష్టించి, వారిని దంపతులను జేసి సంతానమును వృద్ధిచేసికొనుడని చెప్పెను. అదిమొదలుకొని స్త్రీపురుషసంగమము వలన సకల జీవరాసులు జన్మించువ్యవస్థ యేర్పడినది. నేను విరాడ్రూపుడనై ఆయా జీవజాలములలో ఆత్మస్వరూపుడుగా నిలిచియున్నాను. ఒకప్పుడు బ్రహ్మ నన్ను జూచి "మహాత్మా!ఈ సృష్టిలో బహువిధములైన స్వభావములు గలవారు పుట్టుచున్నారు. కొందరికిపుణ్యకర్మలుచేయు బుద్ధి పుట్టుటలేదు. అట్టివారికి స్వర్గాదిపుణ్యలోకములును, కైవల్యమును ఎట్లు కలుగునో సెలవి"మ్మని కోరెను. నేను "కమలాసనా!దక్షిణదేశమున సముద్రతీరమున ఒక వటవృక్షమున్నది. దాని నీడలో గూర్చున్నచో బ్రహ్మహత్యాది దోషములు గూడ నశించును.

ఆ వటవృక్షమునకు ఉత్తర భాగమునందుఒక మందిరమున్నది.అందులో నొక అందమైన విగ్రహమును పరమేశ్వరుడు స్థాపించెను. దానిని దర్శించిన నరులకు శోకమోహములు తొలగి వైకుంఠప్రాప్తి కలుగును.

ఒకప్పుడు యమధర్మరాజు పురుషోత్తమ క్షేత్రమునకు వచ్చి, నాకు (శ్రీమన్నారాయణునకు) నమస్కరించి, "నానారూపకుడవై జ్యోతి స్వరూపుడవైన ఓ మహానుభావా!నీకు వందనములు"అని వినయముతో పలుకగా, నేనిట్లు అడిగితిని. "యమధర్మరాజా!దేవతలలో ఉత్తముడవు. ధర్మమూర్తివి. ఇట్లు నా దగ్గరకు వచ్చినాడవే"మనిప్రశ్నించితిని.అపుడతడు,"ఈ పురుషోత్తమ క్షేత్రములో ఇంద్రనీలమణి రూపమైన నీ రూపము భక్తులకు కోరిన కోరికలిచ్చుచున్నది. వారు నిన్ను దర్శించి, శ్వేతమను పేరుగల ఆ భవనము (దేవాలయము)ను జూచి, కామక్రోధాదులు విడిచి పుణ్యాత్ములై వైకుంఠమునకు తిన్నగా బోవుచున్నారు. నావైపు కూడ చూచుటలేదు. నా కసలు పనిలేకయున్నది. జీవుల పాపపుణ్యములు విచారించుట తప్ప యింకేమియు చేయజాలను.నన్ననుగ్రహించియావిగ్రహమునుపాపులకు కనబడకుండ జేయుము"అని కోరగా నేను, ఆ విగ్రహమును మునిజనులకు మాత్రమే చూచుటకు వీలుగాను, ఇతరులకు వీలులేకుండగాను ఇసుకలోపెట్టి పూడ్చిపెట్టితిని. యముడు సంతోషపడి వెడలిపోయెను.

మాళవదేశాధిపతి యింద్రద్యుమ్నుడు, అవంతీనగరమును రాజధానిగా జేసికొని రాజ్యము పాలించుచుండెను. అతడు విష్ణుభక్తుడు. రాజ్యమునందలి ప్రజలను కన్నబిడ్డలుగా జూచుచుండెడివాడు. వర్ణాశ్రమాచార ధర్మములాతని పాలనలో తూచాతప్పకనడచుచుండెడివి. అక్కడ నిత్యము వేదశాస్త్ర ధ్వనులే వినబడుచుండెడివి. పాపాత్ములు గాని మూర్ఖులుగాని ఆ పురమునందు కనబడరు. ఉజ్జయినీ నగరమున మహాకాళుడనుపేరుతోపరమేశ్వరుడు ఆరాధింపబడుచు పాపములు పోగొట్టుచుండును. ఇంద్రద్యుమ్నుడొకనాడు పూర్వసముద్రతీరమున నున్న జగన్నాథుని చూచుటకు పురుషోత్తమ క్షేత్రమునకు వచ్చెను. అక్కడ జగన్నాథునకు ఆలయమును నిర్మింపదలచెను. ముందుగా వటవృక్షరూపుడైన జగన్నాథునకు రాజోచితముగా షోడశోపచారపూజలుచేసి, కళింగదేశాధిపతిని, కోసలరాజును పిలిపించి, "మనము శ్రీ జగన్నాథుని విగ్రహమును చేయించి, ఆపైన ఆలయమును నిర్మింతుము"అని ఒడంబడి, ఆగమశాస్త్రపండితులను శిల్పులను రావించి, "ఇక్కడ జగన్నాథునకు ఆలయమును నిర్మించవలెను. మీరెల్లరును దేశమంతయు దిరిగి అవసరమైన మేలైన రాళ్ళను ఎంపికచేసి తీసికొని రండు"అని వారిని పంపి, వార్తాహరులను బిలిచి,

"మీరు రాజులందరి యొద్దకు బోయి ఆలయనిర్మాణమును గూర్చి చెప్పి, ఈ కార్యమున సహాయము చేయుటకై వారి నందరను ఇచ్చటికి రావలసినదిగా చెప్పు"డని పంపించెను.

ఆ రాజు లందరును వార్త యందినదే తడవుగ సమస్త రాజలాంఛనములతోను, చతురంగబలములతోను పురుషోత్తమక్షేత్రమునకు వచ్చిరి. వారందరిని జూచి యింద్రద్యుమ్నుడు ఆనందించి, యిట్లనెను. "ఈ క్షేత్రము చాల పుణ్య ప్రదమైనది. అందుచేత ఇక్కడ జగన్నాథునకు ఆలయనిర్మాణము చేయవలెను అంతకు ముందే, అశ్వమేధయాగము చేయవలెనని సంకల్పించితిని. ఇంత కార్యభారమునే నొక్కడనే నిర్వహించుట కష్టము కావున మీరందరును నాకు సహకరించి పనిని నిర్వహింపుడు".

చక్రవర్తి తమ్ము అందరిలోన నిట్లు అడుగగా రాజు లందరును పరమానందమునొంది,అశ్వమేధయాగమునకుగావలసినసంభారములన్నియుసమకూర్చిరి. ధాన్యములు మున్నగు ఆహారపదార్థములు, రాజులు, వారి యంతఃపుర స్త్రీలు నివసించుటకు యోగ్యమైన పట కుటీరములు, నేయి, సమిధలు, దర్భలు, మున్నగు హోమద్రవ్యములు, విశాలమైన యజ్ఞశాలలు, దానధర్మములకు సరిపడు గోవులు మున్నగు యజ్ఞమున కవసరమైన సమస్త ద్రవ్యములు సమకూర్చబడెను. దూరదేశముల నుండి వచ్చు బ్రాహ్మణులకును, రాజులకును నానాజాతులవారికిని వారివారికి తగిన వసతులు ఏర్పరుపబడెను. ఒక సుమూహూర్తమున ఇంద్రద్యుమ్నుడు యజ్ఞ దీక్షితుడై యశ్వమును పూజించి దేశముమీదికి వదలెను. అతని కుమారులు చాల పరాక్రమవంతులు. వారా అశ్వమును వెంటనంటి వెళ్ళిరి.

అధ్వర్యుడు, ఉద్గాత, బ్రహ్మ, ఋత్విజులు ఎల్లరును వేదమంత్రోచ్చారణము చేయుచు హోమములు చేయుచుండిరి. పండితులు శాస్త్రచర్చలు సేయుచుండిరి. ఇట్లు మహావైభవముతో శాస్త్రచోదితమైన విధానములతో యజ్ఞము సంపూర్తి యయ్యెను. చక్రవర్తిఅవభృథస్నానముచేసినానాదేశములనుండివచ్చినబ్రాహ్మణులనువస్త్రమాల్యాదులతోను అపరిమిత ధనములతోను సత్కరించెను. రాజులను యథోచితముగా గౌరవించెను.
తానే అన్నింటిని పరిశీలించుచు అందరిని సంతోషపరచెను. యాగము పరిసమాప్త మైనది.
ఇంద్రద్యుమ్ను డొకనా డేకాంతముగా గూరుచుండి పుండరీకాక్షుడైన శ్రీ జగన్నాథుని మనసులో దలచుచు ఇట్లు స్తుతించెను.

"ఓ జగన్నాథా!నీవు సర్వత్ర వ్యాపించి యున్నవాడవు. ఈ సృష్టిలో ప్రతి అణువు గూడ నీ స్వరూపమే. నీ విన్ని భిన్నరూపములలో గనబడుచున్నను అద్వైతుడవే. అజ్ఞానులమగుమావంటిమానవులకుద్వైతుడవుగాను,అనేకుడవుగానుకనబడుచుందువు. నీ మహిమను దేవతలే తెలిసికొనలేరు. మావంటి అల్పబుద్ధుల కెట్లు బోధపడును?నేను ఇదివరలో ఎన్నో జన్మము లెత్తినాను. ఎన్నో స్వభావములతో ప్రవర్తించినాను. మానవ పశుపక్షి క్రిమికీటకాదులలో ఎన్ని మాతృగర్భములలో పుట్టినానో లెక్కలేదు. జన్మము లెత్తిన తరువాత ఎన్నో సుఖములను దుఃఖములను గూడ అనుభవించితిని. మానవ జన్మ మెత్తినపుడు ఎన్నో శాస్త్రములు చదివితిని, వేదములు చదివితిని. పురాణములు, నీతిశాస్త్రములు అభ్యసించితిని. ఎంతయో ధనము నార్జించితిని. పుత్రకళత్రబంధు మిత్రాది పరివారములలో మసలి ఆనందించితిని. వారిలో ఎవరైన దూరమైనచో దుఃఖించితిని. జలయంత్రము (ఏతాము) వలె జీవితములో ఎగుడుదిగుడులు చూచితిని. దారిద్ర్యములనుభవించితిని, ఐశ్వర్యములను అనుభవించితిని. ఇటువంటి సంసార చక్రములో బడి దీని అంతయును జూడలేక పరితపించుచున్నవాడను. నీవే కరుణించి నన్ను ఈ సంసారబంధవిముక్తుని జేయవలెను. నీకన్నసమర్థులు వేరెవ్వరును లేరు. నా యోగము (ఉన్నత స్థితినొందుట), నా క్షేమము (ఆస్థితి చిరకాలము నిలుచుట) నీ చేతిలోనిది. నిన్ను సేవింపని మనుజులు అధములు. వారికి నీయందు భక్తి యెట్లు కలుగును?అందుచేత నేను ఎప్పుడే జన్మమునెత్తినను నీ నామ సంస్మరణమును, నీయందు అచంచలభక్తిని నాకు ప్రసాదింపుము. ఐనను ఎవ్వరి కెట్టి ఫలములను, గతులను ఇవ్వవలయునో నీకు తెలిసియే యుండును. ఇట్లడుగుట మా వెఱ్ఱితనము. ఇవియే నీకు అనంతకోటి ప్రణామములు"

(ఈ స్తవరాజము నెవ్వరు చదివినను వినినను ఐహికాముష్మిక సుఖములు గలుగును.)

ఇంద్రద్యుమ్నుడు చేసిన స్తోత్రమునకు జగన్నాథుడు సంప్రీతు డయ్యెను. ఒకనాటి రాత్రి కలలో ఇంద్రద్యుమ్నునికి సాక్షాత్కరించి "ఓ రాజా!నీ భక్తికిని, నీవు చేసిన యాగమునకును సంతుష్టుడ నైతిని. నీకొక విషయము చెప్పెదను. నీవు జగన్నాథుని ప్రతిమను జేయించి ప్రతిష్ఠించ దలచితివి గదా!రేపు ఉదయముననే సముద్రతీరమునకు వెళ్ళుము. అచ్చట మహావైశాల్యము గల అశ్వత్థవృక్ష రొకటి కనిపించును.ఒక గండ్రగొడ్డలితో ఆ వృక్షమును నఱికి పడగొట్టుము. అయ్యో!ఇది మహావృక్షము.

దీనిని నరుకవచ్చునా యని అనుమానింపకుము. అసలు ఆ వృక్షమును జూడగానే నీకు పరమానందము కలుగును గాని ఇన్ని యాలోచనలు రావు. ఆ వృక్షము నట్లు నరికి, దానినుండి పెద్దకొమ్మను వేరుచేసి దానితో జగన్నాథప్రతిమను చేయింపుము. నీ మనసులోనున్న రూపముతోనే ఈ ప్రతిమయు తయారగును. విచారింపకు"మని అదృశ్యుడయ్యెను.

రాజు మేలుకొని, భగవద్ధ్యానపరుడై ఆ రాత్రి గడపి, వేకువనే సముద్రస్నాన మొనరించి ఇష్టదైవమును పూజించి బ్రాహ్మణాశీస్సులు పొంది, ధానధర్మములు చేసి సపరివారుడై సముద్రతీరమునకు జేరెను. అక్కడ మహావైశాల్యముతో నిలిచియున్న అశ్వత్థవృక్షము కడకు బోయి కలలో శ్రీమన్నారాయణుడు చెప్పిన రీతిగా పదునైన గండ్రగొడ్డలితో ఆ వృక్షమును నఱకెను. తరువాత దానిని ముక్కలుగా నరకబోగా అక్కడికి దేవశిల్పి యగు విశ్వకర్మయు, విష్ణుమూర్తియు బ్రాహ్మణ వేషములతో వచ్చిరి. భూమికి దిగిన సూర్యచంద్రులేమో యన్నట్లు ప్రకాశించు వారిద్దరిని జూచి రాజు నమస్కరించెను.వారుఅతనితో నిట్లనిరి. "ఏమయ్యా, మహావృక్ష మిది. సముద్రతీరమున అడవులలో బడి యున్నది. నీకేమి అడ్డము వచ్చెను?"విషవృక్షోపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతమ్"(విషవృక్ష మైనను పెంచినదానిని స్వయముగా నరకుట తగనిపని.) అని పెద్దలు చెప్పిన సూక్తిని వినలేదా?"

రాజు వారితో సవినయముగా "అయ్యా!ఇది జగన్నాథుని యాజ్ఞ. నేను జగన్నాథుని ప్రతిమను చేయించుటకు ప్రయత్నించుచుండగా నిన్న రాత్రి నాకొక స్వప్నము వచ్చినది. ఈ వృక్షమును ఛేదించి దీని శాఖతో విగ్రహమును చేయింపుమని జగన్నాథుడాజ్ఞాపించినాడు. అందుచేతనే దీనిని నఱికితిని గాని వేరొక కారణము లేదు"అని పలుకగా విని - ఆ బ్రాహ్మణులు సంతోషించి, " రాజా!నిను వంటి ధర్మాత్ముని పాలకునిగా పొందిన ప్రజలు చాల ధన్యులు. సంసారలంపటుడవు కాక ఆ మహాసముద్రమును తరింపగోరి శ్రీనాథుని ఆరాధించినావు. ఇటు రమ్ము. ఈ సమీప వృక్షచ్ఛాయను గూర్చుండి పుణ్యకథలు చెప్పుకొందము. అదియును గాక ఇప్పుడు నాతో వచ్చిన యీ బ్రాహ్మణుడు విశ్వకర్మ యంతటి శిల్పి. ఇతనికి విగ్రహము నిర్మించు పని నొప్పజెప్పినచో నీకు నచ్చిన రూపములో చెక్కి యిచ్చును.

నీవు ప్రస్తుతము ఈ సముద్రతీరమును విడిచి దూరముగా వెళ్ళుము"అని చెప్పగా రాజు వారికి నమస్కరించి పరివారముతో దూరముగా బోయెను.

అప్పుడు శ్రీనివాసుడు విశ్వకర్మను జూచ, "నీవు ఈ చెట్టుకొమ్మతో అపురూపమై, విచిత్రమై, శంఖచక్రగదాశార్ఙ్గ ప్రముఖాయుధములతోను, సర్వాలంకారములతోను జగన్నాథుని ప్రతిమను నిర్మింపుము. దానితోపాటు బలరామమూర్తి విగ్రహమును నిర్మింపుము. హరికి సోదరియైనసుభద్రాదేవివిగ్రహమునుగూడతయారుచేయుము"అని చెప్పగా విశ్వకర్మ అందు కంగీకరించెను.

విశ్వకర్మ, రత్నకుండలములు, నీలాంబరము, ఒకచేత హలము (నాగలి)ను, రెండవచేత గదయు, తెల్లని కాంతిగల శరీరమును గలిగిన బలరాముని విగ్రహము మొదటచెక్కెను.రెండవవిగ్రహముశ్రీకృష్ణభగవానునిది.పీతాంబరముధరించియున్నట్లును, శ్రీవత్సమును, శంఖచక్రములు ధరించినట్లును, పరమసుందరమైన నీలమేఘచ్ఛాయ గల శరీరముతో ప్రకాశించు చున్నట్లును, ఆ ప్రతిమను విశ్వకర్మ మలచెను. పద్మపత్రములవంటి నేత్రములు, చందమామ వంటి మొగము, వివిధవర్ణములతో నొప్పు పట్టుచీరయు, సర్వాలంకారములు శోభించునట్లుగా సుభద్రవిగ్రహమును గూడ చెక్కెను. ఇంద్రద్యుమ్నుని బిలిచి, జగన్నాథుడు ఆ విగ్రహములను చూపించెను. సరిగా, అతడు మనసులో తలచుకొన్నట్లే ఆ విగ్రహములు మలచబడినవి. ఇంత స్వల్పకాలములో, ఇన్ని యలంకారములతో ఇంత సుందరమైన విగ్రహములను నిర్మించిన వారిరువురను జూచి, రాజు పరమాశ్చర్యభరితుడై ఇట్లనెను. "మహానుభావులారా!అద్భుతమైన తేజస్సుతోను రూపములతోను ప్రకాశించుచున్న మీ రెవ్వరు?మాయారూపములలో వచ్చిన దేవతలనుకొందును. దయచేసి మీ వృత్తాంతములు తెలుపుడు".

అనగా విని జగన్నాథుడిట్లనెను. "సర్వ వేదాంత రహస్యములును జ్ఞానగమ్యుడని యెవని నందురో ఆ పరమేశ్వరుడను నేను. చరాచర విశ్వ మంతయు నేనే. నీవు భక్తుడవు గనుక నీకు దర్శన మిచ్చినాను గాని, సామాన్యులకు కనిపింపను. నీకొక వరము నిచ్చెదను కోరుకొనుము". రాజుమాటలు విని బ్రహ్మానందమును పొంది సాష్టాంగ నమస్కారములు చేసి, "దేవా!ఆనందస్వరూపమై పరమపావనమగు పరమపదమును నా కనుగ్రహింపుము"అనియడుగగా జగన్నాథుడు, "ఇంద్రద్యుమ్నా! నీవు అనేక యజ్ఞయాగాదులును,

పుణ్యకర్మములును చేయుచు ఈ భూచక్రమును పదివేలతొమ్మిది వందల యేండ్లు పరిపాలన చేయుదువు. నీవు చేసిన దానముల ధారలతో ఒక మడుగు ఏర్పడును. ఆ పిమ్మటనీవు దేవేంద్రాదులకు గూడ పొంద శక్యముగాని పరమపదమును పొందెదవు. ఇక్కడికి నైర్భతిదిశగా నొక మఱ్ఱి చెట్టున్నది. దాని సమీపమున ఒక మండపము (దేవాలయము.) గలదు. అది సమస్తపుష్పఫలవృక్షములతోను అలరారుచుండును. రాబోవు ఆషాఢ శుద్ధపంచమినాడు మఘానక్షత్రమునందు నన్ను అక్కడ ప్రతిష్ఠించి యేడురోజులు పూజాపురస్కారములు చేయుము"అని చెప్పగా విని రాజు మహా సంతోషమునుబొంది, ఈ చర్మచక్షువులతోనే నేను జగన్నాథుని దర్శించినాను. ఇంతకంటె మరేమి కావలెనని భావించుచు, సుభద్రా బలరామకృష్ణ విగ్రహములను పల్లకీలలో బెట్టించి దేవాలయమునకు తీసికొని వెళ్ళెను.

భగవానుడు చెప్పిన సుముహూర్తసమయమున, ఆగమశాస్త్ర విధానముగా ఋత్విక్కుల వేదమంత్రములతో విగ్రహములను ప్రతిష్ఠించి కళాన్యాసము చేయించెను. ఆ విగ్రహప్రతిష్ఠను యథాశాస్త్రముగా నడిపించిన బ్రహ్మకును, (గురువుగారికిని) ఋత్విక్కులకును బంగారము, రత్నములు, ముత్యములు, దక్షిణలుగా నిచ్చి వస్త్రాభరణములతో పూజించెను.

శుద్ధద్వాదశి తిథిగల రోజున శ్రీ జగన్నాథుని దర్శించిన భక్తునికి, డెబ్బదివేల సంవత్సరములు ఒంటికాలిమీద నిలిచి యేకాగ్రతతో తపముచేసిన ఫలము లభించును. జ్యేష్ఠమాసమున పంచతీర్థయాత్ర చేసి జగన్నాథుని దర్శించిన వారికి విష్ణులోకములు లభించును. శుక్లపక్షమున యాత్ర చేయుటకు వీలులేనిచో కృష్ణపక్షమునందైనను చేయవచ్చును.

ఇంద్రద్యుమ్న తీర్థములో స్నానమాడిన వానికి స్వర్గాది పుణ్యలోకములు గలుగును. ఈ సరస్సు ఒడ్డున ఎవరైన పితరులను ఉద్దేశించి పిండప్రదానము చేసినచో వాని పితరులు తరించెదరు. పిండప్రదానము చేసినవాడు, ఇరువది యొక్క తరముల వారిని తరింపజేయును.

పంచ తీర్థ మహిమ

ఇంద్రద్యుమ్నుని పేరుతో వెలసిన తీర్థమే పంచతీర్థమని పిలువబడును. ఈ తీర్థమునందు నారాయణనామ స్మరణము చేయుచు అఘమర్షణ స్నానము చేసి, బ్రహ్మయజ్ఞమును, దేవ పితృ తర్పణములును జేయవలెను. ఆపైన జగన్నాథుని పూజింపవలెను.అట్లుచేయునరుడుపైయేడుతరములవారిని,తనతరువాత ఏడుతరముల వారిని తరింపజేయును. తాను స్వయముగా విష్ణులోకమునకు దేవవిమానముపై వెళ్ళును. ఏకాదశినాడు ఉపవాసముచేసి ఈ పైన చెప్పిన కృత్యముల నాచరించినను, జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమా తిథియందు ఆచరించినను విశేషమైన ఫలము గలుగును. జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమా తిథి, దశవిధపాతకములను హరించును గనుక దానికి "దశహర"అని పేరు వచ్చెను. సమస్త తీర్థ జలములును ఆ పంచతీర్థమున నివసించును గావున జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమనాటిస్నానధ్యానతర్పణాదికృత్యములువిశేష ఫలప్రదములని చెప్పబడెను. అట్లు పాపములను హరింపజేసికొని తరువాత సుభద్రా బలరామ సహితుడైన జగన్నాథుని అర్చించినవాడు విష్ణులోకమును పొందును.

ఈ పురుషోత్తమ క్షేత్రమునకు సాటి వచ్చునది మరి యే క్షేత్రమును లేదు. ఇతర క్షేత్రమహిమలు దీనియందుపదునారవవంతుకూడ ఉండవు."కలాంనార్హంతి షోడశీమ్". అశ్వములలో నుచ్చైశ్శ్రవమును, మునులలో వ్యాసుడును, ఇంద్రియములలో మనస్సును, వర్ణములలో "అ"కారమును, ఛందస్సులలో గాయత్రియు, అంగములలో శిరస్సును, విద్యలయందు మోక్ష విద్యయు, దైత్యులందు ప్రహ్లాదుడును, ధాతువులలో బంగారమును,దేవర్షులలోనారదుడును,యజ్ఞములలోఅశ్వమేధమును,మంత్రములందు ప్రణవమును ఎట్లు శ్రేష్ఠములయి యుండునో అట్లేపుణ్య క్షేత్రములందు ఈ పురుషోత్తమ క్షేత్రము సర్వ శ్రేష్ఠముగా నెంచబడును.

కండు మహర్షి చరిత్ర

సూతుడు, పురుషోత్తమక్షేత్ర మహాత్మ్యమును జెప్పుచు నొక యితిహాసమును మునుల కిట్లు చెప్పెను. కండు డను మహర్షి ఒక అరణ్యమున తపము చేయుచుండెను. ఆయన వేద వేదాంగ విశారదుడు. తన వద్దకు వచ్చినవారి సంశయములను నివారింపగల పాండిత్యము గలవాడు. ఆయన, శరీరము క్షణభంగురమని తెలిసిన వేదాంతి.

అందుచే పురుషోత్తముడైన జగన్నాథుని మనసులో నిలిపి సమస్త ప్రపంచ విషయములను విడిచి తదేక నిష్ఠతో తపము చేయుచుండెను. అతని తపః ప్రభావమునకు దేవేంద్రుడు భయపడి దానిని చెరుప నుద్దేశించి ప్రమ్లోచన యను అప్సరసను బిలిచి, "నీవు వెళ్ళి ఆ కండుముని తపమును పాడుచేసి రావలెను"అనగా ఆమె ముని శపించునేమో యని భయపడి "మహేంద్రా!రంభాద్యప్సరసలు నాకంటె సౌందర్యవతులున్నారు. వారిని పంపవచ్చును గదా!నే నెంత?నా సౌందర్య మెంత? "అనగా ఇంద్రుడు "నీ వల్లనే ఈ కార్యము కొనసాగవలెను. నీకు మన్మథుని, వసంతుని సహాయముగా పంపుచున్నాను. వెళ్ళి పని సాధించుకొని రమ్ము"అని పంపగా నామె కండుముని తపోవనమునకు వెళ్ళెను. అతని తపఃప్రభావము చేత ఆ వనమున గల జంతువు లన్నియు పరస్పరమైత్రితో నుండెను. వృక్షములు ఫలపుష్ప సంభరితములై కనుల పండువుగా నుండెను. అక్కడికి వచ్చిన ప్రమ్లోచన ఆ వనసౌందర్యమునకు ముగ్ధురాలయ్యెను. అది ప్రభాత సమయము. ప్రకృతి మనోహరముగా నున్నది.
ఆ సమయమున ఆమె ఒక పూలచెట్టు క్రింద కూర్చుండి లోకములు పరవశించునట్లు గానము చేయుచుండెను. మదన వసంతు లామెకు తోడుగా నుండిరి.

కండుముని ప్రాతస్సంధ్యావందనమునకై లేచెను. ఈ గానము శ్రుతి మనోహరముగా వినిపించెను ముని ప్రమ్లోచన వద్దకు వెళ్ళి "నీ వెవతెవు?నీవు వచ్చిన పని యేమి?"అని ప్రశ్నించెను. ఆమె "మునివరా!నీ సేవ చేసి తరించుటకై వచ్చినాను. నీ కెప్పుడేమి కావలెనో చెప్పినచో అన్నియు సిద్ధముగా సమర్పించెదను"అనెను.
ఆ సమయమున మన్మథుడు పూలబాణముల నాముని హృదయములో నాటవేసెను. వసంతు డతనిపై పూల జల్లు కురిపించెను. కోయిల కూసినది. ఇక నేమి?ముని మనసు అప్సరసపై లగ్న మైనది. ముని ఆమె చేయిపట్టుకొని తన భావమును తెలియ జెప్పి, ఆమె నాశ్రమ కుటీరములోనికి దీసికొనిపోయెను. తాము వచ్చిన పని నెరవేరినందుకు సంతోషించి మదన వసంతులు స్వర్గలోకమునకు బోయి, యింద్రుని కావిషయమును జెప్పిరి. ఇంద్రుడు చాల సంతోషించెను.

కండుముని ప్రమ్లోచనతో గూడి నూరు సంవత్సరాలపాటు, ఇది పగలు, ఇది రాత్రి అను భేదము తెలియకుండ భోగసాగరమున తేలియాడుచుండెను.
మునివేషములో నున్నచో ఆమె తనను అసహ్యించుకొనునేమోయితపశ్శక్తిని ఖర్చుపెట్టి పదియారేండ్ల నవయౌవనరూపము ధరించి ఆమెతో సుఖపడుచుండెను.

వంద యేండ్లు గడచిన తరువాత ఆమె, "నేను స్వర్గ పట్టణమునకు పోవుదును. సెలవి"మ్మనెను. అతడు "వెళ్ళవచ్చును లెమ్ము ఇంక కొంతకాల ముండు"మనెను. ఆమె మునికి ఎదురు చెప్పలేక ఉండిపోయెను. ముని తపస్సు మాట మరచిపోయెను. దేవతారాధనములు, స్నానములు, సంధ్యలు, జపములు, వేద పారాయణలు అన్నియు మూలబడెను.

ఇంకొక వందయేండ్లు గడచెను. అప్సరస, వెళ్ళెద ననెను. అతడు, ఉండు మనెను. ఆమె ఉండిపోయెను. మరికొంత కాలమును కాల పురుషుడు మ్రింగివేసెను. ఒకనాటి సాయంకాలమున కండుముని ఆమెతో "ఓ వనితామణీ!సాయంకాల మగుచున్నది. సంధ్యవార్చి వచ్చెదను. ప్రొద్దుటినుండియు నీతోనే సరిపోయినది"అనుచు త్వరపడసాగెను. ప్రమ్లోచన నవ్వి "ఇప్పుడు సంధ్య వార్చెదవా?ఇటువంటి వెన్ని సంధ్యాకాలములు గడచినవో తెలియునా?"అని యడుగగా అతడు "నీవు ఈనాటి ఉదయముననే గదా వచ్చితివి?ఇంతలో నన్ను హాస్య మాడెదవా?"అనెను. ఆమెయు నతనిని జూచి "మునీంద్రా!నిజమే చెప్పుచున్నాను వినుము. నీవు నన్ను ప్రభాత వేళ చూచినది నిజమే, అది యెన్నేండ్ల క్రిందటి మాట?ఈ మధ్యలో తొమ్మిది వందల యేడేండ్లును, పైన ఆరు మాసములును, ఆపైన మూడు రోజులను దొరలిపోయినవి"అని చెప్పగా అతడు పరమాశ్చర్యము నొంది "నీవు హాస్యమునకై అసత్య మాడుట లేదు గదా?"అని ప్రశ్నించెను. ఆమె "నిజమే చెప్పితి"నని, మునియేమనునోయనుభయముచే గడగడ వణికి పోయెను.కండుముని, ఆమె చెప్పినది విని చాల సిగ్గుపడి "ఎంతటి వారికిని కామక్రోధాదులను విడుచుట శక్యముగాదు. ఓ తరుణీ!వానిని జయించిన వాడే భగవంతుని చూడ గలుగును. ఇదంతయు నా అవివేకము చేత జరిగెను. తపము, స్వాధ్యాయము, నిత్య కర్మానుష్ఠానములు, దేవపూజలు సమస్తమును చెడిపోయెను. నీ తప్పేమున్నది?నీవు ఇంద్రుడు చెప్పిన పని చేయుటకు వచ్చితివి. ఆ పని సంపూర్ణముగా నెరవేరినది గదా!ఇంక నీవు స్వర్గ పట్టణమునకు పొమ్ము. నిన్ను శపించుటకు మన సొప్పదు. ఏలయందువా?సజ్జనుల తోడి సఖ్యము సాప్తపదీనమని (ఏడుమాటలతోగాని, ఏడడుగులు కలసి వేసినగాని ఏర్పడునది) అందురు. నీవు నాతో గలసి యింతకాల ముంటివి. అంతేకాక ఇందులో నీవు చేసిన దోషములేదు.

ఇదంతయు నాదోషమే. పొమ్ము"అనగా నామె యింకను భయము వీడనిదై, తన శరీరమున చెమటలు గ్రమ్మగా వృక్షముల చిగుళ్ళతో దుడుచుకొనుచు ఆకాశమార్గమున అమరావతి కేగెను. ముని ఆమె గర్భములో విడిచిన తేజము చెమట రూపమున వృక్షముల నంటుకొని వానినుండి మారిషయను కన్యక పుట్టెను. ఆ మారిష ప్రచేతసు లనువారిని పెండ్లాడి దక్షుడను కుమారుని గనెను.

పశ్చాత్తాపముతో వేగిపోవుచున్న కండుముని, తన తపశ్శక్తి తిరిగి సంపాదించుకొనుటకు పురుషోత్తమ క్షేత్రమునకు వచ్చి పురుషోత్తముని దర్శించి, ఆ సమీపముననే ఊర్ధ్వబాహుడై, మహాతపము చేసెను. కొంతకాల మిట్లు తీవ్ర తపము చేయగా, మనోహర నీలవర్ణ దేహముతోను, పీతాంబరముతోను, తులసీవనమాలికలతోను, శంఖచక్రాది ఆయుధముల తోను, ఫాలమున కస్తూరీ తిలకముతోను, శిరస్సున మయూర పింఛముతోడి కిరీటముతోను, దివ్యమైన శరీర కాంతితోను జగన్నాథుడు ప్రత్యక్షమయ్యెను. అట్లు ప్రత్యక్షమయ్యెను. అట్లు తన యెదుట సాక్షాత్కరించిన జనగ్నాథుని జూచి అమితానంద భరిత హృదయుడై "ఓ పుండరీకాక్షా!నీవు నన్ను అనుగ్రహించుట చేత నా తపస్సు ఫలించెను. నా జన్మము సార్థకమైనది"అనుచు ఆ సర్వేశ్వరుని తన శక్తి కొలది స్తుతించెను. అప్పుడా జగదీశ్వరుడు, "మునిరాజా!నీవు పరమ భక్తిభావముతో చేసిన తపమునకు మెచ్చితిని. నన్ను పరమభక్తితో సేవించిన వారెవ్వరైనను నా పరమ పదమును పొందుదురు. అటువంటప్పుడు బ్రాహ్మణుడవు, వేదవేదాంగవేత్తవు, సదాచారుడవు, మద్భక్తి పరాయణుడవు, నీకు ప్రసన్ను డనగుటకు ఆశ్చర్యమేమి?ఏమి వరము కావలెనో కోరుకొనుము"అనగాముని,"కరుణా సముద్రుడా! నేను ఈ అశాశ్వతమైన ప్రపంచములో భోగములు కోరి కాలము వ్యర్థము చేసితిని. అదంతయు స్వప్నమువలె నశించినది. శాశ్వతమైన పరమ పదము బొందవలెనని కోరుచున్నాను. నన్ను అనుగ్రహింపుము"అని ప్రణామము చేయగా ఆ భక్తవరదుడు కండుమునికి మోక్షము నొసంగెను.

పురుషోత్తముని మాహాత్మ్యమును, ఆయన నివసించిన ఆ క్షేత్రమాహాత్మ్యమును చదివిన వారును, వినిన వారును కండుముని పొందినట్టి సుగతిని పొందుదురు. అని బ్రహ్మదేవుడు మహామునులకు చెప్పెననుచు సూతుడు మునులకు వినిపించెను.

## పిండదేహోత్పత్తి

ఆకాశము నుండి వాయువు పుట్టును. అతనికి అగ్నిప్రాణము వంటివాడు. దివము (ఆకాశము) నకు గూడ ప్రాణము అగ్నియే. అగ్నికి ప్రాణము మధుసూదనుడు. అగ్నినుండి రసము పుట్టును. రసము (నీరు) నుండి శోణితము పుట్టును. ఆ రక్తము నుండి మాంసము గలుగను. మాంసము నుండి మేదస్సు (మెదడు) జనించును. దానినుండి అస్థి (ఎముక) జనించును. దానినుండి మజ్జ పుట్టును. మజ్జనుండి శుక్రము జనించును. శుక్రము వలన గర్భము గలుగును. ఇన్నింటికిని రసమే ప్రధానమని గ్రహింప వలెను. ఆ గర్భములో జలము మొదటి భాగము. ఆ జలమును సౌమ్యరాశి యందురు. ఊష్మము (వాయువు) వల్ల ఏర్పడిన గర్భము ద్వితీయ భాగమగును. శుక్రముసోమాత్మకము.శోణితముఅగ్న్యాత్మకము. బీజము నందు చంద్రాగ్ని భాగములు ఇమిడి యుండును. కఫ వర్గము నుండి శుక్రమును, పిత్తవర్గము నుండి శోణితమును పుట్టును. కఫమునకు జన్మస్థానము హృదయము. పిత్తమునకు జన్మస్థలము నాభిప్రదేశము. శరీరమధ్య భాగమునందున్న హృదయము మనస్సుండెడి స్థానము. బొడ్డునుండి కడుపులోపలి వరకు ఉండు నాళము అగ్నికి స్థానము. మనస్సే ప్రజాపతి. కఫము సోముడు, పిత్తము అగ్ని-ఇట్లు జగత్తంతయును అగ్నీషోమాత్మకముగా నుండును (అగ్ని - చంద్ర స్వారూపము).

ఇట్లు గర్భము ఉత్పత్తియై వృద్ధి నొందుచుండగా పరమాత్ముని ఆదేశము వలన వాయువు అందులో ప్రవేశించును. ఆ వాయువు ప్రాణ, అపాన, వ్యాన, ఉదనా, సమానములని అయిదు విభాగములుగా శరీరములో ఉండును.అందులో ప్రాణవాయువు జీవాత్మను వృద్ధి నొందించు చుండును. అపానము శరీరములో పశ్చిమభాగము (గుదస్థానము) నాశ్రయించి యుండును. ఉదనాము కంఠ ప్రదేశముననుండి దేహములో సగము భాగమును పెంచుట కుపయోగించును. వ్యానము శరీరమంతట వ్యాపించి యుండును. సమానము సర్వనాడులు ఏర్పడునట్లు చూచుచుండును. పృథివ్యపస్తేజో వాయురాకాశములనెడి పంచ భూతములను శరీరమందు తమతమ స్థానములలో నిలిచి యుండును.శరీరము పృథివీ తత్త్వము గలది. ప్రాణములే వాయువులు. నవరంధ్రములును ఆకాశభాగములు.

శరీరమునుండి స్రవించెడి వన్నియును జలస్వరూపములు. జ్యోతిస్సు లేదా తేజస్సు అనునది నేత్రాత్మకము. మనస్సు సమస్తేంద్రియములను నడుపుచుండును. ఏ మనశ్శ క్తికి సర్వవిషయములును గోచరించునో అది ప్రధానమనుటలో ఆశ్చర్య మేమి కలదు?ఇట్లు పరమపురుషుడు లోకము నందు జీవసృష్టి చేయును. కానీ యీ లోకమునందలి జీవజాల మంతయు మృతి నొందు స్వభావము గలది. ఏది ఇచట పుట్టునో అది కొంతకాలమునకు మృతి నొందక తప్పదు.

శ్రీకృష్ణ చరిత్రము

ద్వాపర యుగమునందు కాలనేమి మున్నగు చాలమంది రాక్షసులు భూమిమీద రాజులై పుట్టిరి. వారు ధర్మమను పేరుతో అధర్మము లాచరించుచు ప్రజా పాలనకు మారు ప్రజా పీడ చేయుచుండిరి. ఇది భరింపలేక భూదేవి ఒకప్పుడు బ్రహ్మదగ్గరకు బోయి "నేనీ దుష్టుల వల్ల గలిగిన భారమును భరింపలేకున్నాను. దీని కేదైన ఉపాయము చెప్పవలె"నని యడుగగా బ్రహ్మ భూదేవితోను, దేవతా గణములతోను శ్రీహరి యొద్దకు పోయెను. భూదేవి అతనికి తన కష్టములను చెప్పుకొనెను. శ్రీమన్నారాయణుడు, భూమిని ఓదార్చి, తన తలలోని రెండు కేశములను లాగి " ఈ రెండును బలరామ, కృష్ణులుగా అవతరించి భూభారమును మాన్పు"నని చెప్పెను.

శ్రీహరి మాయాదేవిని బిలిచి, "ఓ దేవీ!హిరణ్యకశిపుని కుమారులు, ప్రహ్లాదుని తరువాత బుట్టినవారు ఆరుగురు ఆనాడు నాయాజ్ఞచే పాతాళమునకు బోయిరి. వారిని దేవకీదేవి తొలి ఆరు గర్భములలో నుంచుము. వారు కంసునికి బలి యయ్యెదరు. ఏడవ గర్భమున అనంతుడామె గర్భమున ప్రవేశించును. నీవా గర్భము నాకర్షించి నందుని యింటనున్న, వసుదేవుని భార్యయైన రోహిణి గర్భమున ప్రవేశ పెట్టుము. దేవకి యేడవ గర్భము వ్యర్థ మయ్యెనని అందరును అనుకొందురు. తరువాత ఎనిమిదవ గర్భమున దేవకికినే నుదయించెను. నీవు యశోదాదేవి గర్భమున బుట్టి, వ్రేపల్లెలోని వారందరను నీ మాయలో ముంచివేయుము. వసుదేవుడు నన్ను దెచ్చి నీస్థానమున నుంచి, నిన్ను దేవకి దగ్గరకు దెచ్చును. కంసుడు వధించుటకు వచ్చినపుడు నీ వాతని చేతికి దొరకకుండ పోయి భూమియందు గ్రామదేవతా రూపములతో పూజింపబడుచుండుము"అని పంపగా ఆమె అట్లే యని తనపని మీద వెళ్ళెను.

నారదుడు కంసుని దగ్గరకు వెళ్ళి అతనితో, నీ చెల్లెలు దేవకికి ఎనిమిదవ కాన్పులో నారాయణుడు పుట్టి నీకు మృత్యుకారణ మగునని చెప్పెను.

అతడు దేవకీదేవిని చంపబోయెను. వసుదేవుడు పుట్టిన బిడ్డలను నీ వశము చేసెదననగా వారిని కంసుడు కారాగృహములో బంధించెను. దేవకికి వరుసగా ఆరుగురు కొడుకులు పుట్టిరి. వారిని వసుదేవుడు కంసుని కియ్యగా వాడు వారిని కరుణలేక వధ్యశిలమీద బెట్టి చంపెను. ఏడవసారి దేవకికి గర్భస్రావ మయ్యెను. ఆ గర్భమును మాయాదేవి, రోహిణి గర్భములోనికి ఆకర్షించెను. ఎనిమిదవసారి దేవకికి గర్భము కలిగెను. గర్భస్థుడైన శ్రీహరిని బ్రహ్మాదులు స్తుతించిరి. శ్రావణమాసమున బహుళాష్టమి నాటి రాత్రి దేవకి ప్రసవించెను. శ్రీహరి చతుర్బాహువులతోను, శంఖచక్రాదులతోను పుట్టెను. దేవకీ వసుదేవులు ఆ పరమపురుషుని స్తుతించిరి. దేవకి, నీవు బాలకుని రూపముతో మాకు దర్శన మిమ్మని కోరగా అతడు బాలకు డయ్యెను. మాయా ప్రభావముచేత ఆ సమయమున అందరును గాఢ నిద్రలో బడిపోయిరి. వసుదేవుడు బాలుని పొత్తిళ్ళలో బెట్టుకొని వ్రేపల్లెకు బోవుచుండెను. మధ్య యమునానది, మహావర్షము. బాలకునిపై వర్షము పడకుండ శేషుడు తన పడగలను బట్టెను. యమునా నది వసుదేవునికి మోకాలు లోతయ్యెను. వ్రేపల్లెలో గూడ అందరును గాఢ నిద్రలో బడిరి. యశోద ప్రసవించినది కూడ వారికి తెలియదు. వసుదేవుడీ బాలుని యశోద ప్రక్కలో నుంచి, ఆ మాయా బాలికను గొనివచ్చి చెఱలో నున్న దేవకి కిచ్చెను. అప్పుడు కావలి వారు మేలుకొని కంసునికి చెప్పిరి. అతడు వచ్చి బాలికను చంపబోగా దేవకి "ఇది ఆడుపిల్లగదా!దీని వలన నీకు కీడేమున్నది?పురుషు డైనచో కీడగునని తలపవచ్చును. కావున ఈ బాలికను వదలుమని యేడ్చెను. కంసుడు నిర్దయుడై ఆమెను వధ్య శిల మీద వేయగా ఆమె ఆకాశమున కెగిరి అష్టభుజములతో కిరీటముతో, ఆభరణములతో గనపడి, 'నీకు మృత్యువు తప్పదు. నిన్ను జంపువాడు పుట్టినాడు'అని చెప్పి అదృశ్యురాలయ్యెను. కంసుడు దేవకీ వసుదేవులతో, "నేను చేసిన యత్నము లన్నియు వ్యర్థములైనవి. కాగలది కాక మానదని తెలిసినది. మిమ్ము చాల బాధించినందుకు నన్ను క్షమింపుడ"ని వారిని విడిచిపెట్టి మర్యాదలు చేసెను.

### శ్రీకృష్ణుని బాల్యక్రీడలు

శ్రీకృష్ణుడును బలరాముడును నందుని పల్లెలో పెరుగుచుండిరి. శ్రీకృష్ణుడు, తనను పాలిచ్చి చంపబోయిన పూతన ప్రాణములు తీసెను. తనమీదికి రాబోయిన శకటాసురుని తన్ని చంపెను. తనను గాలిలోని కెత్తుకొనిపోయిన తృణావర్తుని జంపెను.

ఇవన్నియు చూచి నందాదులు చాల భయపడి, వ్రేపల్లెను విడిచి యమునానదీ తీరమున గల బృందావనమునకు వలస పోయిరి. అక్కడ కృష్ణుడు తోడి పిల్లలతో గలసి గొల్లవా రిండ్లలో దూరి పాలు, పెరుగు, వెన్నలు తాను దిని వారికి గూడ తిన్నంత పెట్టెను. ఇట్లు ప్రతి దినమును అల్లరి చేయుచున్న కృష్ణుని ఆగడములు భరించలేక గోపికలు వచ్చి యశోదతో చెప్పిరి. ఆమె కృష్ణుని రోటికి గట్టివేయగా, దానిని ఈడ్చుకొనుచు రెండు మద్ది చెట్ల మధ్యనుండి లాగి ఆ మద్దులను కూలగొట్టెను. ఆ మద్దుల రూపములో నున్న గంధర్వులకు శాపవిమోచనము గలిగించెను. గోవులను గాచుటకు బోయి, యమునానది మడుగులో నున్న కాళియుని మర్దించి అతనిని సముద్రమునకు దరిమివేసి, యమునాజలమునుస్నానపానములకు యోగ్యముగాజేసెను. తాళవనములో ప్రవేశించి ధేనుకాసురునిబలరాముడు సంహరించి గోపబాలురచే తాటి పండ్లు తినిపించెను. కృష్ణ బలరాములు ఇట్లు తమ్ము జంపవచ్చిన చాలమంది రక్కసులను జంపిరి. బ్రహ్మ, ఆవుదూడలను, గోపబాలకులను దాచివేయగా కృష్ణుడు ఒక సంవత్సరము తానే బాలురుగాను, దూడలుగాను రూపెత్తి బ్రహ్మకు తానేమిటో తెలియజేసెను.

## కృష్ణుని జీవిత విశేషములు

కంసుడు ధనుర్యాగము పేరుతో పిలువ నంపగా అక్రూరునితో శ్రీకృష్ణ బలరాములు వెళ్ళిరి. శ్రీకృష్ణుడు కుబ్జనుండి గంధాదులు గ్రహించి ఆమెను అనుగ్రహించెను. ధనుశ్శాలకు బోయి ధనుస్సు విరచెను. కంసుని సభాభవనమునకు బోవుచు తనమీదికి వచ్చిన కువలయాపీడమను ఏనుగును జంపెను. సభలో కృష్ణ బలరాములు చాణూర ముష్టికులను మల్లవీరులను మట్టి గరపించిరి. కృష్ణుడు కంసుని సింహాసనము పైనుండి లాగి పడద్రోసి చంపెను. తాత యైన ఉగ్రసేనుని రాజుగా చేసెను. దేవకీ వసుదేవులను గౌరవించెను. తాను అన్నతో గలసి సాందీపనియను మునీంద్రుని యొద్ద వేదవేదాంగములను ఒక్కసారి విని నేర్చుకొనెను. రాజనీతిని ధనుర్వేదమును నేర్చుకొనెను.వీరి ప్రభావమును జూచి గురువే ఆశ్చర్యపడెను. గురుదక్షిణగాగురుకుమారునిబ్రతికించితెచ్చియిచ్చెను.తనపైదండెత్తినజరాసంధాదులను చాలసార్లు ఓడించెను. ధర్మరాజు చేత రాజసూయము చేయించి యెదిరించిన రాజులను పాండవుల సహాయమున అణచి వేసెను. జరాసంధ శిశుపాలాదులను వివిధోపాయములచే సంహరించెను.

తన్ను వరించిన భీష్మకుని కుమార్తె రుక్మిణి నెత్తుకొని వచ్చి పెండ్లాడెను. జాంబవంతుని గెలిచి శ్యమంతకమణిని దెచ్చి సత్రాజిత్తున కిచ్చి, అతని కుమార్తె యగు సత్యభామను, జాంబవతిని కూడ పెండ్లాడెను. తరువాత ఇంకను ఐదుగురిని మిత్రవిందాదులను వివాహమాడెను. ఇంద్రుని కోరికపై నరకాసురుని జంపి, అతని చెరలో నున్న పదియారువేల నూరుగురు కన్యలను విడిపించి తాను అన్ని రూపములు ధరించి వారిని పరిణయ మాడెను.

ప్రద్యుమ్నుడు

రుక్మిణి కుమారుడు ప్రద్యుమ్నుడు. అతనిని పుట్టినపుడే శంబరుడను రాక్షసు డెత్తుకొనిపోయి చంప నెంచి సముద్రములో బారవేసెను. అతడు చచ్చెనని సంతోషించెను. కాని ఆ బాలుని ఒక పెద్ద చేప మ్రింగెను. అయినను బాలుడు చావలే దు. జాలరులు చేపలు పట్టుచుండగా ఈ చేప వారి వలలో బడెను. ఈ పెద్ద చేపను వారు తమరాజు శంబరునకు కానుకగా నిచ్చిరి.

రాజునకు మాయావతి యను భార్య కలదు. ఆమె రాణియైనను ఇంటి పనులు తానే చేసికొనెడిది. ఈ చేపను శంబరుడు లోనికి పంపెను. చేపను కోయగా బాలకుడు కనబడెను. ఆమె యాశ్చర్యపడుచుండగా నారదుడచటికి వచ్చి, ఈతడు రుక్మిణి కొడుకు. వీనిని నీ మగడు సముద్రములో బారవేయగా చేప మ్రింగినది. ఇపుడు నీకు దొరికినాడు. శ్రద్ధగా వీనిని పెంచుమని చెప్పి వెళ్ళెను. ఆమె యా బాలుని పెంచెను. క్రమముగా అతడు పెరిగి పెద్దవాడయ్యెను. మాయావతి అతనిని మోహించి దానికి తగినట్లు ప్రవర్తించుచుండెను. ప్రద్యుమ్నుడది చూచి నన్ను పెంచిన దానవు. తల్లి ప్రేమ చూపక ఇదేమి ఇట్లు ప్రవర్తించుచున్నావని యడిగెను. ఆమె, నిన్ను గన్నది రుక్మిణి అని అతని వృత్తాంత మంతయు చెప్పి శంబరుని జంపి తన్ను పరిగ్రహింపుమని చెప్పి, అతని కన్ని విద్యలును, మాయా విశేషములును బోధించెను. ప్రద్యుమ్నుడు, విద్యాపారంగతుడై శంబరుని యుద్ధమునకు బిలిచి, ఆ రణములో అతనిని సైన్యములతో సహా పరిమార్చి మాయాదేవితో గూడి ద్వారకా నగరమునకు వచ్చెను. రుక్మిణి అతనిని జూచి గుర్తింపలేకపోయెను. అప్పుడు కృష్ణుడును, నారదుడును అచటికి వచ్చిరి. నారదుడామెతో "తల్లీ!ఇతడు నీ కుమారుడు ప్రద్యుమ్నుడు. పురుటింటి నుండి శంబరు డెత్తుకొనిపోయి చంపబోగా ఈమె సంరక్షించి పెంచినది.

ఈమె శంబరుని భార్య గదా!ప్రద్యుమ్ను డెట్లు ఈమెను వివాహ మాడునని శంకింపవలదు. ప్రద్యుమ్నుడు పూర్వజన్మములో మన్మథుడు. మాయావతి రతిదేవి. ఈమె, ప్రద్యుమ్ను నపహరించిన మాయవిధైన శంబరుని తన మాయలో బడవేసి, అతనికి భార్యగా తన మాయారూపముతో సంచరించి, తన నిజరూపముతో ఈతనిని పెంచి, వరించినది. అందుచేత ఈమెను కోడలిగా స్వీకరింపు మనగా ఆమె కొడుకును కోడలిని ఆదరించెను.

సాంబుడు

జాంబవతీ కృష్ణుల కుమారుడు సాంబుడు. దుర్యోధనుడు తన కుమార్తెకు స్వయంవరము చాటించెను. సాంబుడా స్వయంవరమునకు వెళ్ళి, దుర్యోధనుని కుమార్తెను ఎత్తుకొని వచ్చెను. దారిలోనే భీష్మ ద్రోణాదులతో దుర్యోధను డడ్డగించి సాంబుని ఓడించి బంధించెను. ఈ సంగతి కృష్ణ బలరాములకు దెలిసెను. "అనవసర విరోధము కౌరవులతో మనకు ఎందుకు?నేను వెళ్ళి సాంబుని సామోపాయమున విడిపించుకొని వచ్చెదను"అనుచు బలరాముడు బయలుదేరి హస్తినాపురము బయట ఉద్యానవనములో బసచేసెను. బలరాముడు వచ్చినాడని విని పరివారముతో

దుర్యోధనుడు స్వాగత సత్కారము లిచ్చుటకై యెదురు వెళ్ళెను. దానికి బలరాముడు సంతోషించి, వారితో నిట్లనెను. "నేను ఉగ్రసేనుని ప్రతినిధిగా వచ్చినాను. మా సాంబుని మీరు బంధించినారట గదా!వానిని విడిచి పెట్టవలసినదని మా ఉగ్రసేన మహారాజు ఆజ్ఞాపించుచున్నాడు. కావున వెంటనే వానిని విడిచిపెట్టుడు".బలరాముని మాటలు వినగానే, దుర్యోధన, దుశ్శాసన, కర్ణాదులకే కాక, భీష్మద్రోణాదులకు గూడ కోపము వచ్చినది. వారుబలరామునితో"ఏమయ్యా!అన్నియుతెలిసియిట్లు మాట లాడుచున్నావు. ఇదేమి?కురువంశమున

బుట్టిన చక్రవర్తులను ఒక యాదవుడు ఆజ్ఞాపించుట యేమి?యాదవులకు అసలు రాజ్యాధికారము వహించు అర్హత లేదు. వారు మమ్ము ఆజ్ఞాపించుటయా?వారి యాజ్ఞలకు తల యొగ్గినచో మే మీ రాజలాంఛనములను ధరించుట హాస్యాస్పదము గదా!మర్యాదలు తెలియని మీరు మాటాడినను మేము అంగీకరించము. మీ రాజు ఆజ్ఞాపించినను, నీ వాజ్ఞాపించినను మేము లెక్క చేయువారము కాము. అక్రమముగా ప్రవర్తించిన, సాంబుని వదలెడు ప్రస్తావనయే లేదు.

మీరు మాట్లాడినది చూడగా రాజును ఒక సేవకు డాజ్ఞాపించినట్లు ఉన్నది. మీ యాదవులందరును మా ఆజ్ఞను పాలింపవలసిన వారే గదా!మేము మీకు, మాతో సమానముగా పీటలు వేసి, భోజనాలు పెట్టి, మర్యాదలు చేసినందువలననే గర్వించి యిట్లు మాటలాడుచున్నారు. ఇది మీ తప్పుగాదు. మంచి చరిత్ర లేని మిమ్ము ఇంతవరకును గౌరవించుట మా మంచితనమునకు నిదర్శనము. ఇంక మీ సాంబుని విడిచిపెట్టుట జరుగదు"అని కఠినముగా సమాధాన మిచ్చి, దుర్యోధనాదులు పురములోనికి బోయిరి. వారి మాటలకు బలభద్రునికి ఇంతంత అనరాని కోపము వచ్చినది. "ఉగ్రసేను డాజ్ఞాపించినచో దేవతలు గూడ చేతులు కట్టుకొని నిలిచి యుందురు. ఈ కౌరవులు దుర్మదాంధులై ఈ ఉగ్రసేనుని, మమ్మును పాలించువారట, వీరి యాజ్ఞకు మేము బద్ధులమై యుండవలెనట. ఉగ్రసేనుడనగా నెవడను కొన్నారో వీరు. అతని సేవకుల భార్యలు గూడ పారిజాత పుష్పమాలికలను ధరింతురని తెలియదు కాబోలు. మదముచేత కన్నులు కానరాని ఈ కౌరవులు నందరును భీష్మ ద్రోణాదులతో సహా యమపురికి పంపి లోకమును అకౌరవము చేసెదను"అనుచు తన నాగలిని కోట ప్రాకారమునందు గ్రుచ్చి ఒక్క ఊపున పెల్లగింపగా హస్తినాపుర మంతయు పెద్ద భూకంపము వచ్చినట్లు అల్లల నాడిపోయెను. ఆ ప్రళయ భీకరమైన బలరాముని కోపమును, పరాక్రమును జూచి కౌరవులు గజగజ వణికిపోయిరి. వెంటనే సాంబుని, అతడు వలచిన కన్యను తీసికొని వచ్చి, బలరాము నెదుట నిలిపి "ఓ మహానుభావా!నీ మహామహిమ నెరుగక నోటికి వచ్చినట్లు మాటలాడి నిన్ను నొప్పించినాము. మా యపరాధములను మన్నింపుము. సాంబుని దెచ్చినాము. నీ కోపము నుపసంహరింపు"మని అనేక రీతులుగా ప్రార్థించిరి. బలరాముడు సాంబుని జూచి శాంతపడెను. సాంబుడు పెదతండ్రికిని, అక్కడి ద్రోణభీష్మాదులకును నమస్కరించెను. బలరాముడు వారిని దీసికొని ద్వారకకు పయన మయ్యెను.

పుండ్రదేశమున కధిపతిగా వాసుదేవుడు అనుపేరుగల ఒక రాజుండెను. అతడును రాక్షసాంశతో జనించినవాడే. వాడు శ్రీకృష్ణుని కడకు ఒకనాడు దూతను పంపెను. వాడు శ్రీకృష్ణునితో కడకు ఒకనాడు దూతను పంపెను.వాడు శ్రీకృష్ణునితో, తమ రాజు మాటలుగా ఇట్లు పలికెను.

"ఓ వాసుదేవా!నీవు నా పేరు పెట్టుకొని నా వలెనే పీతాంబరమును గట్టి, శంఖచక్రాదులైన ఆయుధములను నా లాగుననే ధరించి విఱ్ఱవీగుచున్నావట. వాని నన్నిటిని వెంటనే విడిచిపెట్టి, తప్పాయినది క్షమింపుమని నా శరణు కోరుము. నిన్ను విడిచి పెట్టెదను".

ఈమాటలు విని కృష్ణుడు కోపము పట్టలేక "అట్లే. యుద్ధమునకు వచ్చి అక్కడ ఇవన్నియు విడిచెదనని చెప్పుము". అని వానిని బంపి గరుడు నెక్కి యుద్ధమునకు వెళ్ళెను. వాడును శ్రీకృష్ణుని వలెనే వేషము వేసికొని వచ్చెను. వానిని జూచి కృష్ణుడు నవ్వి, "ఇదిగో, నీ వన్నట్లే ఆయుధములను విడుచుచున్నాను"అని, "ఈ యాయుధములువీనినిచావమొత్తివచ్చుగాక"అనుచువిడిచెను.ఆయాయుధములన్నియు వెళ్ళి పౌండ్రక వాసుదేవుని చితుక బొడిచెను. ఇంక నిలుచుండుటకు కూడ శక్తి లేక వాడు నేలబడి చచ్చెను. వానికి సాయము చేయవచ్చిన కాశిరాజును గూడ ససైన్యముగ వధించి భూభారమును దొలగించి వాసుదేవుడు ద్వారకను జేరెను.

ధర్మాత్ములైన పాండవుల పక్షమున నుండి కౌరవులతో యుద్ధము చేయించి దురాచారులైన కౌరవులను హతమార్చెను. ముని శాపము వలన సాంబుని కడుపున ముసలము పుట్టెను. దాని నరుగదీసి సముద్రములో కలుపగా అది తుంగగా మొలచెను. యాదవు లందరును విహారమునకు బోయి అకారణముగా తమలో తాము కలహించుకొని ఆ తుంగకాడలతో బాదుకొని చచ్చిరి. బలరాముని నోటినుండి ఆదిశేషుడు వెడలిపోయెను. శ్రీకృష్ణుని పాదమును బాణముతో ఒక బోయవాడు కొట్టెను. అది కారణముగా శ్రీకృష్ణుడు పరంధామమును జేరెను. శ్రీకృష్ణపత్నులు అగ్నిలో దుమికిరి.

## పితృ దేవతలను గూర్చిన విశేషములు

అమావాస్యనాడు పిండ పితృయజ్ఞము చేయవలెను. సంవత్సరమున కొకసారి తల్లిగాని తండ్రిగానిమరణించినతిథియందువారినుద్దేశించిశ్రాద్ధముచేయవలెను.సపిండీకరణమున ముగ్గురు బ్రాహ్మణులను బెట్టవలెను. విశ్వే దేవత లక్కర లేదు. పవిత్రము గూడ ఒక్కటే. ఇదంతయు అపసవ్యముగానే చేయవలెను. తిలలు, గంధము, నీరు గల పాత్రలు నాలు గుండవలెను. పితరులకు మూడు, ప్రేతకు ఒకటి. ప్రేతపాత్రము నుండి అర్ఘ్యమును దీసికొని "యేసమానా"మంత్రము చెప్పుచు పితృపాత్రలు మూడింటిలో అర్ఘ్యము విడువవలెను. ఏకోద్దిష్ట విధానములో స్త్రీలకు కూడ ఇంతే.

ప్రతి వత్సరమును స్త్రీలకు ఏకోద్దిష్టము చేయవచ్చును. అదియును పుత్రులు లేని వారికే. ఆబ్దికము నాడు పితరుల కట్లు చేయవచ్చు నందురు(?). పుత్రులు లేనపుడీ సపిండీకరణమునుసపిండులుచేయవచ్చును.పౌత్రులుచేయవచ్చును.మాతామహునకు (తల్లి యొక్క తండ్రికి) దౌహిత్రుడు చేయవలెను. తల్లిదండ్రుల రెండు వంశములకును కర్తలగువారుపితరులకును,మాతామహులకునుసమానముగాశ్రాద్ధక్రియలు చేయవలెను. ఎవ్వరును లేనిచో స్త్రీలే అమంత్రకముగా శ్రాద్ధాదులను చేయవలెను. లేదా!తమ జాతివానిచే చేయింపవచ్చును.

సపిండీకరణము తరువాత స్వర్గపాథేయము పుచ్చుకొన్న ప్రప్రపితామహుడు పిండమును వీడి, లేపభుజు డనబడును. పిండముల రూపములోని పితరులు అలేపభుజులు. స్వర్గపాథేయము పుచ్చుకొన్న వానినుండి పై యిద్దరును (మొత్తం ముగ్గురు), అలేపభూజులును, యజమాని (కర్త)యు, మొత్తము ఏడుగురు.

ఇది సాప్తపురుష సంబంధము. ఇంకను ఆపైవారు అనులేపభుజులు. వారిలో నరక వాసులు, పశుపక్ష్యాది రూపములో నున్నవారు, భూతములలో జేరినవారు యజమాన కృతమైన శ్రీద్ధముచేతృప్తిపడుదురు.వికిరాన్నమునకొందరు తృప్తులగుదురు. పిశాచత్వము నొందిన వారికిది తృప్తినిచ్చును. స్నానము చేయునపుడు బట్టనుండి కారిన నీళ్ళతో కొందరు తృప్తు లగుదురు. ఇది వృక్షరూపులగు వారి సంగతి. భూతములై యుండువారు, గంధము తీయునపుడు క్రిందపడు నీటితో తృప్తి నొందుదురు. పశువులలో జన్మించిన వారు పిండము లెత్తునపుడు నేలమీద బడిన నీరు త్రాగి తృప్తు లగుదురు. దంతాలు కూడ రాని బాలకులును, ఏ కారణముచేత నైనను వెలివేయబడిన వారును, శ్రాద్ధము పెట్టు యజమానుల చేతినుండి జారిన నీళ్ళతో తృప్తి నొందుదురు. మరికొందరు, బ్రాహ్మణులు భుజించిన తరువాత ఆచమించునపుడు నేలను పడిన నీళ్ళతోను, కొందరు పాద ప్రక్షాళన చేసిన యుదకముతోను తృప్తి పడుదురు. ఇట్లు ఒక యజమాని శ్రాద్ధము చేయునపుడు అతని వంశము వారెల్లరును తృప్తి నొందుదురు. ఇట్లు పితృదేవతలకు సంతృప్తి చేయువారికి ఇంతమందిని తృప్తి పరచిన మహాపుణ్యము కలుగును.

అన్యాయముగా సంపాదించిన ధనముతో శ్రాద్ధము చేసినచో అది పితరులకు ముట్టదు. రాక్షసులకు చెందను. పితృదేవతల ఆశీస్సులు పొందినవాడు భూమియందు ఆయురారోగ్యైశ్వర్యములతో సుఖపడును.

అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము అనునవి అష్టసిద్ధులు. ఈ సిద్ధులను మించిన మహత్త్వముతో, సర్వమును తానై యుండెడు విరాట్ పురుషుడు, సహస్రశిరస్సులతోను, సహస్ర నేత్రములతోను, సహస్ర పాదములతోను, అనంతములైన కరములతోను వెలుగుచుండును. ఇతడే ఆదిహిరణ్య గర్భుడని చెప్పబడును. భూతములకు ఆదియనియు, బుద్ధియనియు కొందరును, మహత్తు అని కొందరును చెప్పుదురు. అతడు విశ్వాత్ముడై ఏకరూపుడై అక్షరుడని చెప్పబడును. అతనితో ప్రకృతి కూడును. అప్పుడే సృష్టి జరుగును.
అది అవిద్యా సృష్టియనియు, మహత్తనియు, అహంకార మనియు చెప్పబడును.
ఒక్కదానినుండియేచరము,అచరముఅనునవిపుట్టును.ఇవియేవిద్యావిద్యాస్వరూపములు.
అహంకారమునుండి భూజలాగ్ని వాయు నభములను పంచభూతములును
శబ్ద స్పర్శరూపరసగంధము లనెడి తన్మాత్రలతో జనించును. వానినుండి పాంచభౌతిక దేహములు, చర్మ నేత్ర శ్రోత్ర జిహ్వా ఘ్రాణములను పంచేంద్రియములును వాక్, పాద, పాణి, పాయు, ఉపస్థలను కర్మేంద్రియములును జనించును. ఇవి యన్నియు ఒక్కసారిగానే పుట్టును. ఇవి మనస్సుతోకూడ కలిసినచో ఇరువదినాల్గు తత్త్వములగును. ఈ ముల్లోకములు ఈ చతుర్వింశతి తత్త్వముల యాధారముతోనే సృష్టింపబడెను. అనగా అవ్యక్తము నుండియే పుట్టెను. ఈ పుట్టిన వన్నియు క్షరములనబడును. సర్వభూతాత్ముడైన పరమాత్మ అక్షరడనబడును. ఈఅక్షరుడేఇరువదియైదవ తత్త్వము.
సాంఖ్యు లెల్లరును ఈ సమస్త జగత్సృష్టికిని ఈ యిరువది యైదు
తత్త్వములే మూలమని చెప్పుదురు. దీని నెవ్వరెరుంగుదురో, ఆ అక్షరమూర్తిని ఏకాకారునిగా, ఎవరు ఉపాసన చేయుదురో వారికి మరల జన్మము కలుగదు.
ఆ పరమాత్మలో లీనమై మోక్షమును పొందుదురు అని వ్యాసుడు మునులకు చెప్పెనని సూతుడు తనను ప్రశ్నించిన మహామునులకు ఇట్లు బ్రహ్మపురాణమును వినిపించెను.

బ్రహ్మపురాణము సమాప్తము.